ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

శుక్రవారం 19 సెప్టెంబరు 2025

గంగనేరు ప్రాజెక్టుకు వర్షం నీరు

రామాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బుధవారం అర్ధరాత్రి నుంచి రామాపురం మండలంలో కురిసిన భారీ వర్షానికి రాచపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న గంగనేరు ప్రాజెక్టుకు వర్షపు నీరు భారీగా చేరుతోంది. ఇలాంటి వర్షం ఇంకా రెండు, మూడు రోజుల పాటు బాగా కురిస్తే మండలంలో చెరువులు నిండే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పశువులకు, మేకలకు, బర్రెలకు పశు గ్రాసం లేకుండా గ్రామ పరిధిలోని దొరుకుతుందని వారు అంటున్నారు.



గంగనేరు ప్రాజెక్టుకు చేరుతున్న వర్షం నీరు

రైతుబజార్‌లో రూ.8 కే 'ఉల్లి'



రైతుబజార్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉల్లిగడ్డలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రైతుబజార్‌లో రూ.8కే ఉల్లి గడ్డల విక్రయాలు ప్రారంభించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఉల్లిగడ్డలను కిలో రూ.25కు విక్రయిస్తుండగా ప్రభుత్వం సబ్సిడీతో ప్రజలకు ఉల్లిని విక్రయిస్తోందన్నారు. కర్నూలు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 4 టన్నుల ఉల్లిగడ్డలను రైతుబజార్‌లో కిలో రూ.8కే విక్రయిస్తున్నామని, మదనపల్లె ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఎం కోరారు.

జిల్లాలో వానలే.. వానలు

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- తంబళ్లపల్లెలో కుండపోత
- గుర్రంకొండలో కొట్టుకుపోయిన కల్వర్టు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. దీంతో పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. బుధవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. పీలేరు మండలంలో 92 మిల్లీమీటర్ల వర్షపాతం గరిష్ఠంగా నమోదైంది. కనిష్ఠంగా ములకలచెరువు మండలంలో చుక్క కూడా నమోదు కాలేదు. మిగిలిన మండలాల్లో ఒకటి రెండు మినహా దాదాపు అన్ని చోట్ల మంచి వానలే కురిశాయి. గురువారం (బుధవారం అర్ధరాత్రి నుంచి) పరిశీలిస్తే.. గరిష్ఠంగా సంబేపల్లె మండలంలో 83.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కనిష్ఠంగా పెనగలూరు, ఓబులవారిపల్లె, రైల్వే కోడూరు,కలకడ, పీలేరు, కురబలకోట మండ లాల్లో చుక్క కూడా వానపడలేదు. రాయచోటి డివిజన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వానలు పడ్డాయి. రాజంపేట డివిజన్‌లో చాలా తక్కువగా పడ్డాయి. సోమవారం అర్ధరాత్రి, మంగళవారం ఉదయం కూడా జిల్లాలో పలుచోట్ల మంచి స్థాయిలోనే వానలు పడ్డాయి. దీంతో 14వ తేదీ నుంచి 18 వరకు గరిష్ఠంగా 152.6 మిల్లీమీటర్ల వర్షపాతం న మోదైంది. కనిష్ఠంగా ములకలచెరువులో 26.0 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లా అంతటా కలిసి 2356.0 మిల్లీమీటర్లు నమోదైంది. ఈనెల మొదటి నుంచి నేటి వరకు 3457.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఈ వానల వల్ల చిన్న మండెం, రాయచోటి వీరబల్లి మండలాల్లో మండవ్యా నదిలో నీళ్ల ప్రవహిస్తున్నాయి. సుండుపల్లె మండలంలో బాహుదా నదిలో కూడా నీళ్ల ప్రవహిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ మొదట్లో వానలు కురవకపోవడంతో సాధారణ స్థాయి కంటే.. చాలా తక్కువగా పంటలు సాగయ్యాయి జూలై, ఆగస్టులో కురిసిన కొద్దిపాటి వర్షాలకు రైతులు పలు రకాల పంటలను సాగు చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం కురుస్తున్న వానల వల్ల ఇప్పటికే సాగులో ఉన్న పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పవచ్చు. చాలాచోట్ల వరిపంట సాగులో ఉంది. ఈ వానల వల్ల వరికి పెద్దగా ఉపయోగం ఉంటుంది. అదే విధంగా కూరగాయల వంటి పంటలకు కూడా ఎంతో మేలు కలిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ వర్షాల పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



చిన్నమండెం మండలంలో మాండవ్య నదిలో ప్రవహిస్తున్న వర్షం నీరు

భారీ వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు

- 20 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

గుర్రంకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పసలవాండ్లపల్లెలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పందిర్లవంక పెద్ద ఎత్తున సాగింది. దీంతో పంచాయతీ పరిధిలోని గొల్లపల్లె వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్ట్ కొట్టుకుపోవడంతో 20 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ పరిధిలో పందిర్ల వంక ఉంది. టి.గొల్లపల్లె వద్ద వంకపై ఉన్న బ్రిడ్జి నాలుగేళ్ల క్రితం కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. అప్పట్లో సిమెంట్ పైపులను ఉంచి పైన మట్టితో తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వంకలో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో కల్వర్టు కొట్టుకుపోయింది. ఈ మార్గం గుండా ప్రయాణించే 20 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.



గొల్లపల్లె వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు

హాస్టల్ ముందు వర్షం నీరు

గుర్రంకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు, హైస్కూల్ విద్యార్థినులకు వర్షపు నీటి కష్టాలు తప్పడం లేదు. హాస్టల్ ముందు వర్షపు నీరు మోకాళ్ల లోతు వరకు నిలిచిపోతున్నాయి. దీంతో హాస్టల్ విద్యార్థులు లోపలికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా హాస్టల్ పక్కనే హైస్కూల్ విద్యార్థినులకు మరుగుదొడ్లు నిర్మించారు. దీంతో మరుగుదొడ్లకు వెళ్లేందుకు బాలికలు చాలా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఎస్సీ హాస్టల్ ముందు నిలిచిన వర్షం నీరు

తంబళ్లపల్లెలో కుండపోత వర్షం

- పొంగిపొర్లుతున్న చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా 86.2 మి.మీల వర్షపాతం నమోదైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కుంటలు, చెక్ డ్యాంలు, ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరుతుండగా బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి కోసువారిపల్లె బయ్యమ్మ చెరువు, పరుసతోపు పంచాయతీలోని చిన్నేరు ప్రాజెక్టు, డేగలవారిపల్లె వద్ద ఉన్న దబ్బలగుట్ట ప్రాజెక్టులు పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్దేరు ప్రాజెక్టులోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 560 ఎంసీఎఫ్‌టీలు కాగా ప్రస్తుతం 365 ఎంసీఎఫ్‌టీల నీరుంది.



దబ్బలగుట్ట ప్రాజెక్టులో నీరు



మొరవ పోతున్న చిన్నేరు ప్రాజెక్టు



మొరవ పోతున్న దబ్బలగుట్ట పాజెక్టు

లాటరీ ద్వారా రెండు బార్ల ఎంపిక

- మరొకటి వాయిదా
- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



లాటరీ ద్వారా బార్లను ఎంపిక చేసిన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎక్సైజ్ అధికారులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా జిల్లాలో ఏర్పాటు చేయదలచిన మూడు బార్లలో 2 బార్లను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. మదనపల్లిలో 1, రాయచోటిలో 1 బార్‌కు గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ లాటరీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఇందులో మదనపల్లి బార్ గౌతంప్రేమకు, రాయచోటి బార్ కేడం లక్ష్మయ్యకు లాటరీ ద్వారా కేటాయించారు. పీలేరు బార్‌కు తగినన్ని దరఖాస్తులు రానందున లాటరీ నిర్వహించలేదు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, డీపీఈవో మధుసూదన్, ఏఈఎస్ జోగేంద్ర, సీఐలు గురుప్రసాద్, భీమలింగ, ఎక్సైజ్ సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నటువంటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల 85 వేల పైచిలుకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో ఉన్న వికలాంగులు, వృద్ధులకు ఈ స్మార్ట్ రేషన్‌కార్డుల ఆధారంగా ఇంటి దగ్గరే సరుకులు పంపిణీ చేస్తారన్నారు. డీలర్ షాపు ఉన్న సచివాలయాల పరిధిలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అన్ని మండలాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేయనున్నట్లు జేసీ తెలిపారు.

శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌గా పోతుగుంట

- రాజంపేట బీజేపీకి దక్కిన సముచిత పదవి

రాజంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మకమైన శ్రీశైలం దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్‌గా రాజంపేటకు చెందిన బీజేపీ నాయకుడు పోతుగుంట రమేశ్‌నాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రమేశ్‌నాయుడు ప్రస్తుతం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, నంద్యాల బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. విద్యార్థి దశలోనే ఏబీవీపీ నాయకుడిగా గుర్తింపు పొంది బీజేపీలో అంచలంచెలుగా ఎదిగారు. చిన్నప్పటి నుంచే బీజేపీలో ఉంటూ ఆ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆ పార్టీ వెంటే నడుస్తూ అనేక ప్రజా వ్యతిరేక పోరాటాలను నిర్వహించారు. బీజేపీకి రాజంపేటలో ఎవరూ లేని సమయంలో రమేశ్‌నాయుడు ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. నాటి నుంచి నేటి వరకు సుమారు 30 ఏళ్లుగా బీజేపీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన సేవలను మెచ్చి కూటమి ప్రభుత్వంలో ఏకంగా ఆయనను శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానం ప్రాశస్త్యానికి మరింత కృషి చేస్తానని వెల్లడించారు.



పోతుగుంట రమేశ్ నాయుడు

రీసర్వేతో రైతులకు ఇబ్బందులు

- భూములను రీసర్వేకి ముందు స్థితికి చేర్చాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వే కారణంగా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సమస్యలు పరిష్కరించలేకుంటే సర్వేకి ముందున్న స్థితికి భూములను చేర్చాలని కోరారు. గురువారం జరిగిన శాసనసభ సమావేశంలో జీరో అవర్ ప్రశ్నోత్తరాల కార్యక్రమం సందర్భంగా కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రీసర్వే జరిగిన భూములకు రైతుల హక్కులకు సంబంధించిన రికార్డులు రావడం లేదని, బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదని, రిజిస్ట్రేషన్లు కూడా జరగడం లేదని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. చాలా భూముల విస్తీర్ణం రికార్డుల్లో ఎక్కువ ఉందని కానీ క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా విస్తీర్ణం తక్కువగా ఉందని చెప్పారు. జిల్లా మొత్తం పరిస్థితి ఇలాగే ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలను ఇది వరకే ప్రభుత్వం దృష్టికి కూడా తెచ్చామని, టీడీపీఎల్పీ సమావేశంలో కూడా సీఎంకు వివరించామని గుర్తు చేశారు. పీలేరు నియోజకవర్గంలో 63 గ్రామాల్లో రీసర్వేలో తప్పులు జరిగాయని చెప్పారు. బిడ్డల పెళ్లిళ్ల కోసం భూమిని అమ్ముకుందామన్నా కుదరడం లేదన్నారు. రీసర్వే తప్పులను సరిచేయలేని పక్షంలో రీసర్వేకు ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ మంత్రి, కలెక్టరు చొరవ తీసుకోవాలని కిశోర్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



అసెంబ్లీలో రీసర్వే గురించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డికి ఘనంగా నివాళులు



రాజగోపాల్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి, శ్రావణ్‌రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్‌రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన సతీమణి హేమలతమ్మ, కుమారులు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి కుమారుడు, వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం చైర్మన్ శ్రావణ్‌రాజ్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా తండ్రి రాజగోపాల్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గంలో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. 1983లో నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సమయంలో ముఖ్యపాత్ర పోషించి వెలిగల్లు ప్రాజెక్టు రూపకర్తగా నిలిచారన్నారు. అంతేగాకుండా వృద్ధులకు రూ.30 పింఛన్ పథకాన్ని రాజగోపాల్‌రెడ్డి రామారావు దృష్టికి తీసుకెళ్లి పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. కార్యక్రమంలో నాగులగుట్టపల్లి హరినాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కాలాడి ప్రభాకర్ రెడ్డి, మద్దిరేవుల రమేశ్‌రెడ్డి, రామాపురం, గాలివీడు, చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లె మండలాలకు చెందిన ఆర్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

అత్యవసరమా.. అవతలికెళ్లు..! 6

జూదశాలపై పోలీసుల డ్రోన్ దాడులు

- 16 ద్విచక్రవాహనాలు, 5 మొబైల్ ఫోన్లు సీజ్
- ఆరుగురి అరెస్టు, రూ.55 వేలు స్వాధీనం

మదనపల్లె అర్బన్/టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మారుమూల అటవీ ప్రాంతం వద్ద వ్యవసాయ భూమి చుట్టూ కొండలు, గుట్టలు మధ్యలో ప్లాస్టిక్ టార్పాల్‌తో టెంట్లు వేసి అత్యంత రహస్యంగా జూదశాల నిర్వహిస్తున్న వారిపై డ్రోన్ సహాయంతో పోలీసులు మెరుపుదాడులు చేశారు. మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో ములకలచెరువు సీఐ వెంకటేశ్వర్లు, మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్ ఎస్ఐలు అన్సర్‌బాషా, రహీముల్లా, 20 మంది కానిస్టేబుళ్లు, డ్రోన్ ఆపరేటర్ వెళ్లి జూదశాల చుట్టుపక్కల అరకిలోమీటర్ మేర మాటు వేశారు. డ్రోన్ నిఘాలో జూదశాల కనపడటంతో అక్కడికి వెళ్లిన పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఆరుగురు పట్టుబడగా, మిగిలిన వారు పారిపోయారు. దీనిపై మదనపల్లె డీఎస్పీ కార్యాలయం వద్ద గురువారం డీఎస్పీ మహేంద్ర ప్రెస్‌మీట్ నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిమ్మనపల్లె మండలం సరిహద్దు అటవీ ప్రాంతం వద్ద వ్యవసాయ భూమిలో జూదశాల నిర్వహిస్తుండటంతో తమ ప్రత్యేక బృందంలోని పోలీసు అధికారులు, సిబ్బంది వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 16 ద్విచక్రవాహనాలు, 5 మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. దీంతో పాటు మదనపల్లెకు చెందిన ఇ.శ్రీనివాసులు, వి.శ్రీరాములు, పుంగనూరుకు చెందిన కె.అక్బర్‌బాషా, ఎం.రెడ్డెప్పనాయక్, జి.హరి, కలికిరికి చెందిన వి.వెంకటరమణను అరెస్టు చేసి వారి వద్ద రూ.55 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడుతూ పరారైన వారిని గుర్తించి వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు.



పారిపోతున్న జూదరులను అరెస్టు చేస్తున్న పోలీసులు (డ్రోన్ వ్యూ)



జూదరులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

తాగునీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

పీలేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో తాగునీటి వనరుల పరిరక్షణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పీలేరు నియోజకవర్గంలోని అధికారులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటగా గురువారం ఆయన పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పీలేరు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విధిగా ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి వనరులను తనిఖీ చేయాలన్నారు. వాటిని శుభ్రపరిచే పనులు, క్లోరినేషన్‌ను తప్పనిసరిగా చేయాలని, ప్రతిసారీ టైమ్ స్టాంపుతో ఫొటోలు, రికార్డులు అప్‌లోడ్ చేయాలన్నారు. పైప్‌లైన్లు ఎక్కడా మురుగునీటి కాలువల్లో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అటువంటి పొరపాటు జరిగితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు సరికొత్త ఆలోచనలతో ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కొత్త ప్రతిపాదనలు, ప్రణాళికలను పూర్తిగా సిద్ధం చేయాలని, తదుపరి సమావేశంలో వాటిపై సమీక్షిస్తామన్నారు. అంతకుమునుపు ఆయనకు రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, పీలేరు తహసీల్దారు శివకుమార్, పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సర్పంచ్ హబీబ్‌బాషా స్వాగతం పలికారు. పలు సమస్యలపై ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు, డీపీవో రాధమ్మ, జీఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి, పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

అత్యవసరమా.. అవతలికెళ్లు..!

- సమయపాలన పాటించని వైద్యులు
- ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లోనే
- సామాన్య రోగులకు తప్పని తిప్పలు
- సీజనల్ వ్యాధులతో ప్రజల ఇబ్బందులు
- ఇదీ రాయచోటి ఏరియా ఆసుపత్రి తీరు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో 100 పడకల ఏరియా ఆసుపత్రి ఉన్నప్పటికీ.. ఇక్కడ ఎమర్జెన్సీ వైద్యసేవలు అందడం లేదు. అత్యవసరం అంటూ ఎవరు పోయినా వేరే ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. దీనికితోడు ప్రస్తుతం జనాన్ని వేధిస్తున్న సీజనల్ వ్యాధులకూ వైద్యసేవలు సరిగా అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. దీనికి కారణం ఇక్కడ పనిచేసే వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో పాటు ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లో గడుపుతుండటమే.

రాయచోటిటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ప్రతి రోజు 800 నుంచి 900 వరకు ఓపీ ఉంటోంది. పట్టణానికి చెందిన వందలాది మంది పేదలు ప్రతిరోజు ఏరియా ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారు. అయితే ఆసుపత్రిలో పనిచేస్తున్న చాలా మంది వైద్యులు ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లో గడుపుతుండడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఆసుపత్రికి వచ్చే జనరల్ వైద్యుల్లో కొంత మంది ఓపీ చూడకుండా కేవలం ఆపరేషన్లకే పరిమితం అవుతున్నారు. అలాగే స్త్రీల శస్త్ర చికిత్స విభాగం, పురుషుల శస్త్ర చికిత్స విభాగాల్లో వైద్యులు అంతంత మాత్రమే విధులకు హాజరవుతుండడంతో చాలా మంది రోగులు సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

పని ఇక్కడ.. నివాసం వేరేచోట

రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, పీలేరు, పులివెందుల నియోజకవర్గాల్లోని వీరబల్లి, సుండుపల్లె, కేవీపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ, చక్రాయపేట, సత్యసాయి జిల్లాలోని కదిరి, ఎన్పీ కుంట తదితర మండలాల నుంచి కూడా ఎంతో మంది పేద రోగులు రాయచోటి ఏరియా ఆసుపత్రికి వైద్యంకోసం వస్తుంటారు. వైద్యులు పనిచేసేచోటే నివాసం ఉండాలనే నిబంధన ఉంది. అయితే ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు కొంతమంది కడప, పీలేరు నుంచి విధులకు హాజరవుతుండటంతో వీరు సమయానికి రావడం లేదని అంటున్నారు. రాయచోటి ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు గానూ ప్రస్తుతం 21 మంది ఉండగా ఒక జనరల్ మెడిసిన్, ఒక ఆర్థోపెడిక్ వైద్యుల కొరత ఉంది.

ఆర్థోపెడిక్ డాక్టర్ లేక..

రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు చికిత్స అందించాల్సిన ఆర్థోపెడిక్ డాక్టర్ లేకపోవడంతో ఎమర్జెన్సీ వైద్యం అందక సామాన్య రోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తిరుపతి, వేలూరు, బెంగళూరు ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఇటీవల వినాయక చవితి సందర్భంగా వినాయకుడి విగ్రహాల ఏర్పాటు పరిశీలనకు వెళ్లిన ప్రసాద్ అనే కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై రాయచోటి ఏరియా ఆసుపత్రికి వచ్చారు. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు వెళ్లారు. దీనికి తోడు సీజనల్ వ్యాధులతో అల్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన కొంతమంది సీనియర్ వైద్యులు కేవలం ఆపరేషన్లకు పరిమితం అవుతుండడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపు చూస్తున్నారు.



సీజనల్ వ్యాధులతో ఓపీ వద్ద బారులుతీరిన రోగులు

ప్రహరీ గోడ కూలిపోయి..

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన 100 పడకల ఆసుపత్రికి పడమర భాగంలో ఉన్న పాత ప్రహరీగోడ వర్షాలకు కూలిపోయింది. దీంతో ఆసుపత్రి ఆవరణం పశువులు, కుక్కలకు ఆవాసంగా మారింది. మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు పడమర వైపు నుంచి ఆసుపత్రి ఆవరణలోకి ప్రవేశిస్తుండడంతో రాత్రి సమయాల్లో ఇక్కడ ఉండే రోగులకు రక్షణ లేకుండా పోయింది. దీనికి తోడు ఆసుపత్రి రోగులకు, సిబ్బందికి నీటి కొరత కూడా వెంటాడుతోంది. కూలిపోయిన ప్రహరీగోడను త్వరగా పూర్తి చేసి పశువులు, కుక్కలు, మందుబాబులు ఆసుపత్రిలోకి ప్రవేశించకుండా చూడాలని పట్టణ ప్రజలు, రోగులు, ఆసుపత్రి సిబ్బంది కోరుతున్నారు.

రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్

వైసీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మించినప్పటికీ ఎమర్జెన్సీ కేసులకు అవసరమైన క్రిటికల్‌కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో సకాలంలో సరైన ఎమర్జెన్సీ వైద్యం అందక కొందరు కాళ్లు, చేతులు పోగొట్టుకొని వికలాంగులైన దాఖలాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాయచోటి ఏరియా ఆసుపత్రికి రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేయించడమే కాకుండా ఇటీవలనే దీని నిర్మాణానికి భూమిపూజ కూడా చేపట్టారు. 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాద బాధితులకు ఇక్కడే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.



మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం



వివిధ ప్రాంతాల నుంచి రాయచోటి ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రతి రోజు 800 నుంచి 900 వరకు ఓపీ నడుస్తోంది. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు గానూ 21 మంది ఉన్నారు. ఒక జనరల్ మెడిసిన్, ఒక ఆర్థోపెడిక్ వైద్యులు రావాల్సి ఉంది. ప్రస్తుతం నీటికొరత లేదు. ఆసుపత్రికి పడమర భాగంలో ప్రహరీ గోడ నిర్మించాల్సి ఉంది. 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తయితే ఎమర్జెన్సీ వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయి.

- డేవిడ్ కుమార్, సూపరింటెండెంట్, రాయచోటి ఏరియా ఆసుపత్రి

ఐదు బార్లకు లైసెన్సులు కేటాయింపు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ఐదు బార్లకు లక్కీడిప్ ద్వారా లైసెన్సులు కేటాయించామని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఐదు బార్లు మంజూరు కాగా వాటిలో నాలుగు బార్లకు ఇది వరకే కలెక్టర్ లక్కీడిప్ ద్వారా కేటాయించారన్నారు. మిగిలిన ఒక బార్‌కు గురువారం రాయచోటిలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి చలపతినాయుడుకు లైసెన్సు మంజూరు చేశారన్నారు. బీకొత్తకోటలో ఒక బార్‌కు ఈడిగ కులానికి కేటాయించగా కుడుము ఆదిత్యకు లైసెన్సు దక్కిందన్నారు.

'బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి'

పీలేరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. తిరుమల పర్యటనకు వచ్చిన గవర్నర్‌ను బుధవారం రాత్రి కలిసిన డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, రాజ్ కుమార్, మునీంద్ర నాయక్ వినతి పత్రం అందించారు. టీటీడీ షాపింగ్ కాంప్లెక్సులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని, ఉద్యోగాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు జారీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నలుగురికి ఏపీడీ నందకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మెమోలు జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఏపీఓ సుధాకర్ తెలిపారు. గురువారం ఉపాధి కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఏపీడీ సమీక్షించారు. తుమ్మరకుంట ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, బూర్లపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు, అంకిరెడ్డిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ ఆదినారాయణ, మడుమూరు ఫీల్డ్ అసిస్టెంట్ భార్గవ్ సమావేశానికి కనీస సమాచారం ఇవ్వకుండా హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు వారిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మెమోలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

రుషివాటిక పాఠశాలకు నోటీసు

బీకొత్తకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బీకొత్తకోట మండలం గట్టు పంచాయతీ గట్లపై నిర్వహిస్తున్న రుషివాటిక ఆశ్రమ పాఠశాలకు విద్యాశాఖాధికారులు నోటీసు జారీచేశారు. వేదభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ఇటీవల జరిగిన ఘటనలో లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన విద్యార్థి శేషాద్రి తీవ్రంగా గాయపడి కనుచూపు కోల్పోవడం, దీనిపై బీకొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ పాఠశాల నిర్వాహకులు అందజేసిన వివరాల మేరకు హోం స్కూలింగ్‌కు అనుమతులు లేవని, విద్యార్థులకు తాత్కాలిక సాంస్కృతిక శిక్షణ ఇస్తున్నట్లు యాజమాన్యం పేర్కొందని విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. అలాంటి హోం స్కూలింగ్‌కు అనుమతులు లేవని, జీఓ ఎంఎస్ నెంబర్1, ఎడుకేషన్ (పీఎస్)01-01-1994 ప్రకారం ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాతే నిర్వహించాలని, లేని పక్షంలో నిర్వాహకులపై తగు చర్యలకు సిఫారసు చేస్తామని ఎంఈవో రెడ్డిశేఖర్ పాఠశాల సిబ్బందికి నోటీసు జారీచేశారు.

---

559 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పుల్లంపేట/రాజంపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలాల్లో మండల పరిధిలోని జాగువారిపల్లె పంచాయతి సాదువారిపల్లె సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 309 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకుని సీజ్ చేసినట్లు తహశీల్దారు పుల్లారెడ్డి తెలిపారు. కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన కేఏ56 3519 నంబరు లారీలో ప్రజా పంపిణీకి చెందిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు.

దీంతో రైల్వేకోడూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసులు పరిశీలించి 309 బస్తాల (15.45 క్వింటాళ్ల)ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్ క్రాంతికుమార్‌ను అరెస్ట్ చేసి లారీని పుల్లంపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని రాజంపేట స్టాకు పాయింట్‌కు తరలించినట్లు తహశీల్దారు తెలిపారు.

అలాగే.. రాజంపేట మండల పరిధిలోని మిట్టమీదపల్లె గ్రామ శివారులో గురువారం గుట్టపై నిల్వ ఉంచిన 250 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా తరలించవద్దని, లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని రాజంపేట డిపోకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.





రాజంపేట : గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం - పుల్లంపేట : పట్టుబడిన రేషన్ బియ్యం లారీతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చికిత్సను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై

గాలివీడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పశువైద్యులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం కుమ్మరపల్లిలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్‌లో భాగంగా పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 35 ఎదకు రాని పశువులను, 25 పశువులకు సాధారణ పరీక్షలు, 62 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. అంతేగాక గొంతువాపు నివారణ టీకాలు వేయడం, దూడలకు నట్టల నివారణ మందులు తాపామన్నారు. అనంతరం పాడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు మాలకొండయ్య, సహాయ సంచాలకులు శివారెడ్డి, స్థానిక పశువైద్యులు నాగరాజు, సిబ్బంది శశికళ, లక్ష్మీనారాయణ, హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

కలికిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ నిరసనకు దిగుతున్నట్లు స్థానిక డాక్యుమెంట్ రైటర్లు తెలిపారు. దీని కారణంగా వీరు ఎలాంటి దస్తావేజులు తయారు చేయరు. రాష్ట్ర సంఘం ఈ మేరకు సమాచారమిచ్చినట్లు చెప్పారు. ఆస్తులు కొనుగోలు, అమ్మకాల వ్యవహారాలను సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో పూర్తి చేయడానికి డాక్యుమెంట్ రైటర్లు దస్తావేజులను తయారు చేస్తారు. దీనికి అనుబంధంగా ఈ మొత్తం లావాదేవీల వివరాలను ఇంగ్లీషులో పబ్లిక్ డాటా ఎంట్రీ (పీడీఈ) పేరుతో డిజిటల్ డాక్యుమెంట్‌ను కూడా వీరు తయారు చేసి దస్తావేజుతోపాటు పీడీఈని కూడా రిజిస్ట్రేషన్ కోసం సమర్పించాల్సి ఉంది. అయితే పీడీఈ డిజిటల్ డాక్యుమెంట్‌లో ఏవైనా సవరణలు అవసరమైతే దస్తావేజులోని వివరాల ఆధారంగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ఉద్యోగులు దాన్ని సవరించే (కరెక్షన్) వెసులుబాటు ఉండేది. అయితే ఇటీవల సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో కరెక్షన్ చేసే వెసులుబాటును తొలగించారు. పీడీఈలో ఏ చిన్నపాటి సవరణకైనా ముందు తయారు చేసిన డిజిటల్ డాక్యుమెంట్‌ను పూర్తిగా తొలగించి తిరిగి మొత్తం తయారు చేయాల్సి ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ల తీవ్రమైన కాలయాపన జరుగుతోందని రైటర్లు చెపుతున్నారు. ఆస్తుల కొనుగోలు అమ్మకందార్లు పదే పదే వారి మొబైల్ ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను రైటర్లకు చెప్పాల్సి ఉంది. చాలా మంది ఫోన్ నంబర్లు ఆధార్ కార్డుకు అనుసంధానం కాకపోవడంతో దీన్ని కూడా పూర్తి చేస్తేగానీ ఓటీపీలు వచ్చే అవకాశం లేదు. దీంతోపాటు మరికొన్ని సమస్యలు పరిష్కారించాల్సిందిగా కోరుతూ పెన్‌డౌన్ నిరసన చేపట్టి శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్లను బహిష్కరిస్తున్నట్లు రైటర్లు చెప్పారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ.. స్థానికుల నిరసన



ప్రభుత్వభూమి కబ్జా చేశారని నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని విశ్రాంత లెక్చరర్ వెంకటరమణ ఆక్రమించారని గ్రామస్థులు గురువారం స్థలంలో నిరసన చేపట్టారు. మదనపల్లె మండలం, కొత్తవారిపల్లె పంచాయతీ, ఎనుములవారిపల్లె గ్రామదేవత గంగమ్మ ఆలయం ముందర ప్రభుత్వ స్థలాన్ని అక్రమించారని ఆరోపించారు. దీని పక్కనే ఉన్న భూమిని వెంకటరమణ కొనుగోలు చేశారని, దాంట్లోకి కలిపేసుకునేందుకు ప్రభుత్వ భూమిని చదును చేసినట్లు గ్రామస్థులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సర్వే చేసి ఇది ప్రభుత్వ భూమిగా తేల్చారని గ్రామస్తులు వివరించారు. ఈ విషయమై ఆయనను వివరణ కోరగా ఈ స్థలం పక్కనే భూమిని కొనుగోలు చేశానని, ఇల్లు కట్టుకుంటే రోడ్డుపై నేను ఏలా వెళ్లాలని ప్రశ్నించారు. సర్వేలో ఎలా తేలితే అలా నడుచు కుంటానన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థినులు

నందలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపారు. కడప స్పోర్ట్స్ స్కూల్, పులివెందులలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19, అండర్-17, 14 రగ్బీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరి గురువారం మాట్లాడుతూ జి.గురుస్నేహలత (ఇంటర్మీడియట్), పి.లక్ష్మీస్పందన(10వ తరగతి), వై.నవ్యశ్రీ(9వ తరగతి), వై.మహిమ(9వ తరగతి) రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులు క్రీడల్లో రాణించడానికి కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు కేజీ సునీతకు ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలి : కలెక్టర్

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో తహశీల్దార్లు, ఎంపీడీవో వివిధ శాఖల, మండల స్థాయి సిబ్బంది తదితరులతో రెవెన్యూ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, వ్యవసాయం, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, విద్యుత్, పర్యాటకం తదితర అంశాలపై ఆయన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ప్రారంభించిన రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకం, దీపం, తల్లికి వందనం, వంటి పథకాలపై వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో ఈకేవైసీ పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించారు. స్త్రీశక్తి పథకంలో బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో తదితర అంశాలపై ఆర్టీసీ అధికారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాలపై సమీక్షిస్తూ స్మార్ట్‌కార్డుల పంపిణీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా హౌసింగ్, ఉద్యానవనశాఖ, పంచాయతీరాజ్, చెత్తసేకరణపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రీసర్వే, పర్యాటకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శాఖల ప్రాధాన్యత అంశాలపై మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైలుకింద పడి యువకుడు మృతి



జయసింహ (ఫైల్)

నందలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె గ్రామానికి చెందిన కాశిగారి జయసింహ(26) అనే యువకుడు రైలుకింద పడి మృతిచెందాడు. మృతుని బంధువుల వివరాల మేరకు.. కాశిగారి పెంచలయ్య, సరస్వతి దంపతుల ప్రథమ కుమారుడైన జయసింహ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఉపాధి నిమిత్తం బెంగుళూరు వెళ్లి మూడు రోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చాడు. కాగా గురువారం సాయంత్రం యువకుడు స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. యువకుడు మృతితో వారి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సంఘటనపై సీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

లారీ బోల్తా.. డ్రైవర్లకు గాయాలు



బోల్తా పడిన టమోటాల లారీ

ములకలచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలో గురువారం తెల్లవారుజామున టమోటా లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు నుంచి చత్తీస్‌ఘడ్‌కు టమోటాలు తీసుకెళ్తున్న లారీ తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో ఎదురుగా వస్తున్న ఓ ప్రవేటు బస్సు మీదకు దూసుకురావడంతో తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన డ్రైవర్లు సయ్యద్‌బాషా, షబ్బీర్ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. లారీ బోల్తాపడడంతో అందులో ఉన్న టమోటాలు నేలపాలై తీవ్ర నష్టం వాటిల్లింది.

చికిత్సపొందుతూ మహిళ మృతి



శోభారాణి (ఫైల్‌ఫోటో)

కలకడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శోభారాణి(34) మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వాల్మీకిపురం మండలం దయ్యాలబండ వాసి వెంకటరమణ భార్య శోభారాణి ఈ నెల 14న సొంత పనుల నిమితం కలకడకు వచ్చి తిరిగి గుర్రంకొండకు ద్విచక్ర వాహనంలో బయలుదేరింది. కదిరాయచెరువు సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి కిందపడడంతో తలకు గాయమైంది. గాయపడిన మహిళను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

భూతగాదాలో ఘర్షణ.. ఇరువర్గాలపై కేసు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఘర్షణ పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతీ నల్లంవారిపల్లి వాసులు శ్రీనివాసులు అతని భార్య భువనేశ్వరి దాయాదులైన రెడ్డెప్ప, అంజమ్మలకు భూమి విషయమై ఘర్షణ జరిగింది, దీంతో ఒకరినొకరు కొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి అమ్మ కొడుతోంది

ఫిర్యాదు చేసిన పిల్లలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి రోజూ తమను అమ్మ కొడుతోందని, అమ్మపైన ఆమెకు మద్యం తెచ్చిచ్చే వ్యక్తిపైనా చర్యలు తీసుకోవాలని పిల్లలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిల్లల కథనం మేరకు..

మదనపల్లె పట్టణం, బాలజీ కాలనీలో కాపురం ఉంటున్న లక్ష్మన్న, వాణీ దంపతులకు టెన్త్, ఏడోవతరగతి చదివే ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మన్న యాక్సిడెంట్ కేసులో జైలుకు వెళ్లి శిక్ష అనుభవిస్తున్నాడు. ఏడాదిగా వాణి మద్యానికి బానిసయ్యారు. ఆమెకు ఆటో డ్రైవర్ రెడ్డి నిత్యం మద్యం తెచ్చి ఇస్తున్నాడు. మద్యం తాగిన తరువాత ఆమె ఇంట్లో సంగటి కర్రతో రోజూ తమను విచక్షణారహితంగా కొడుతోందని పిల్లలు తెలిపారు. ఆదే వీధిలో ఉన్న ప్రదీప్, మోహన్‌రాజ్ పిల్లలను కాపాడే ప్రయత్నం చేయగా వారిపైనా ఆమె దాడికి దిగారు. దీంతో గురువారం పిల్లలిద్దరూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం వీరిద్దరూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉల్లి రైతు కన్నీరు...

● ధర పతనంతో ఆవేదనలో అన్నదాతలు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని నానుడి. అలాంటి ఉల్లి పంట సాగు చేసిన రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక కన్నీరు కారుస్తున్నారు. ఆరుగాలం శ్రమించి దిగుబడి చేతికందే సమయంలో బహిరంగ మార్కెట్‌లో ధర పతనం కావడంతో దిగాలు చెందుతున్నారు. ఒకవైపు అధికవర్షాలు మరోవైపు మార్కెట్‌లో ధర పతనంతో ఉల్లి రైతుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. పంటకు గిట్టుబాటు



వీరపునాయునిపల్లెలో కోత కోసి మార్కెట్‌కు తరలించేందుకు ఉంచిన ఉల్లిగడ్డలు

ధర లేకపోవడంతో కొందరు రైతులు పొలాల్లోనే గొర్రెలు, మేకలు, పశువులకు వదిలేస్తున్నారు. క్వింటా 600 రూపాయలకు ధర పడిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 4089 ఎకరాలలో రైతులు ఉల్లిపంటను సాగు చేశారు. అంకిరెడ్డిపల్లె, కొమ్మద్ది, బుసిరెడ్డిపల్లె, అడవిచెర్లోపల్లె, వెల్లుర్తి, వెంకటాపురం, వీఎన్‌పల్లె, అనిమెల, యు.రాజుపాలెం, తాటిమాకులపల్లె గ్రామాలలో రైతులు అధికంగా సాగుచేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉల్లి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

ధర లేదని... అధైర్యపడకండి

సింహాద్రిపురం, సెప్టెంబరు 18: మండలంలో ఉల్లి సాగు చేసిన రైతులు ధర లేదని అధైర్యపడవద్దని మండల ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం రావులకొలను పంచాయతీలోని అహోబిళం గ్రామానికి చెందిన రైతు అంకాల్‌రెడ్డి ఉల్లి గడ్డలను గ్రామస్తులకు ఉచితంగా ఇవ్వడంతో పాటు మిగిలిన వాటిని ఆరుబయట పారవేయడంతో హెచ్‌ఓ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవనశాఖ అధికారి మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం నుంచి జీఓ రాగానే మార్క్‌ఫెడ్ ద్వారా కిలో రూ.12లు ధరతో కొనుగోలు చేస్తామని తెలిపారు. ఉల్లి రైతులు ఇ-పంటలో నమోదు చేసుకున్నట్లయితే ప్రతి రైతుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్, ప్రభుత్వం ఇచ్చే ప్రత్యామ్నాయ ప్రోత్సాహకాలు వర్తిస్తాయన్నారు.

ఆందోళన వద్దు

ప్రభుత్వం ఆదుకుంటుంది :కలెక్టర్

ఖాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర లేదని ఉల్లి రైతులు ఆందోళన చెందవద్దని.. ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన మండలంలో వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నూర్పిడి చేసిన ఉల్లి పంటను వర్షాలకు భయపడి నిలువ ఉంచుకోలేక తక్కువ ధరకు రూ.5-6లకే అమ్ముకోవాల్సి వస్తోందని, వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని, ఉల్లిపంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, తహసీల్దారు ఏవీ రమణమ్మ, వ్యవసాయశాఖాధికారి నాగార్జున, సీఐ వంశీధర్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్యం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



ఉల్లి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

నాసిరకం విత్తనాలతో నష్టపోయాం..

● న్యాయం చేయాలని రైతుల వేడుకోలు



మొక్కజొన్న కంకులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ముద్దనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాసిరకం విత్తనాలతో నష్టపోయాం.. మమ్ములను ఆదుకోవాలని మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు శాస్త్రవేత్తలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధి శెట్టివారిపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను కడప డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు వెంకటపతి, డాక్టర్ క్రిష్ణప్రియ, శ్రీవల్లి, మాధురి, యాస్మిన్ బృందం, వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమగోడు వెల్లబోసుకున్నారు. తాము కొద్ది రోజుల క్రితం అనంతపురం జిల్లా తాడిపత్రిలోని శ్రీమధుసాయి ట్రేడర్స్‌లో మొక్కజొన్న విత్తనాలు తీసుకువచ్చి పంట సాగుచేశామన్నారు. విత్తనాలు నాసిరకకం కావడంతో పంట కాలం పూర్తయినా కంకికి విత్తనాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతుల వద్ద నుంచి విత్తన సాగు, ఎరువుల వాడకంపై వివరాలు ఆరా తీశారు. అన్ని కోణాల్లో పరిశీలించి పూర్తి నివేధిక జిల్లా వ్యవసాయాధికారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏవో వెంకటకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులు ఇళ్లకు తిరుగు ముఖం

● నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మెగా డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా పడింది. ఈనెల 19న జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో గుంటూరులో భారీ వర్షాలతో అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రకటించారు. కొత్త తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. అయితే ఈ కార్యక్రమానికి అభ్యర్థులు విజయవాడ వెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా 43 బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం జిల్లా కేంద్రం డీఈఓ కార్యాలయం నుంచి బస్సులు ప్రారంభం కావాల్సి ఉండగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు రావడంతో అభ్యర్థులకు వాయిదా అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు తిరిగి ఇంటి ముఖం పట్టారు. బస్సులు కూడా సంబంధిత డిపోలకు బయలు దేరాయి.

22 నుంచి జరగాల్సిన శిక్షణ కూడా... : నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుల కోసం సెప్టెంబరు 22 నుంచి 29 వరకు జరగాల్సిన ఇండక్షన్ ట్రైనింగ్ వాయిదా పడింది. తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత ఫ్యాకల్టీ సభ్యులు డీఆర్పీలకు వెంటనే తెలియజేయాలని ఆయన సూచించారు.



డీఈఓ కార్యాలయం వద్ద నుంచి ఇళ్లకు వెళుతున్న డీఎస్సీ అభ్యర్థులు

చోరీకి పాల్పడ్డ దొంగలు అరెస్ట్

రూ.8లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



పట్టుబడిన నిందితులను, ఆభరణాలను చూపుతున్న పోలీసులు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణం వెంకటయ్యనగర్‌లో ఈ నెల 10వ తేదీ ఇంటి తాళాలు పగులకొట్టి పట్టపగలు ఓ ఇంట్లో దోపిడీకి పాల్పడ్డ నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.8లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పట్టణం లోని అర్బన్‌పోలీస్‌స్టేషన్ ఆవరణలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, సీఐ లింగప్ప, ఎస్ఐ సత్యనారాయణలు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనా స్థలంలో సేకరించిన ఫింగర్‌ప్రింట్స్, సీసీపుటేజ్‌ల ఆధారంగా నిందితులు కడప ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ దిలీప్‌కుమార్, నాయబ్ రసూల్‌గా గుర్తించామన్నారు. వీరిపై గతంలో కూడా పలు చోరీ కేసులు ఉన్నట్లు వారు తెలిపారు. వీరి వద్ద నుంచి 118.04 గ్రాముల బంగారు నగలు, 4 గ్రాముల వెండి నాణేలను స్వాధీనం చేసుకున్నారు. నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్‌చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీ జరిగిన నాలుగురోజుల సమయంలోనే లింగప్ప పకడ్బందీగా నిందితులను పట్టుకున్నందుకు జిల్లా ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

ఉద్యోగం పొందడం ఎలా..!

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న అధికారిణి చల్లా రత్నకుమారి

వేంపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొదటిసారి ఉద్యోగం పొందడం ఎలా అనే అంశంపై ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశ నిర్వహణ అధికారిణి చల్లా రత్నకుమారి, రిసోర్స్ పర్సన్ జానిబాష విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్రిపుల్‌ఐటీలో చదివి స్టార్టప్ ప్రారంభించి రూ.3కోట్ల టర్నోవర్‌తో ఉన్న జానిబాష తన అనుభవాలను చెబుతూ ఎలా మొదటి ప్రయత్నంలో ఉద్యోగం పొందాలనే అంశాలను తెలిపారు. ఏఓ రవికుమార్, రమేష్, సత్యానంద, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసుకోవాలి : మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కోఆర్డినేటర్లు సుబ్బరాయుడు, తిరుపతిరెడ్డి, దీప్తిలు తెలిపారు. గురువారం ఎన్‌ఎస్‌ఎస్ 11,15 యూనిట్‌ల ఆధ్వర్యంలో గురువారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. క్యాంపస్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. మొదట ర్యాలీ నిర్వహించారు.

రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలి

● జాతీయ సదస్సులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ పేర్కొన్నారు. గురువారం కడప యోగివేమన విశ్వవిద్యాలయంలో 75 సంవత్సరాల భారత రాజ్యాంగం-సాంకేతిక పదజాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలని, ప్రజల మాతృభాషలో విలువైన గ్రంథాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ రాజ్యాంగ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తు చేసుకోవాలన్నారు. ముఖ్య వక్త ప్రొఫెసర్ నవేద్ జమాల్ రాజ్యాంగ సూత్రాలను అన్ని భారతీయ భాషలో సులభంగా అందించేందుకు సాంకేతిక పరిభాష అవసరమన్నారు. సీఎస్‌టీటీ అసిస్టెంట్ డైరెక్టర్లు జేఎస్ రావత్, షాజాద్ అహ్మద్ అన్సారీ సంస్థ భాషాభివృద్ధి కోసం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు, వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

● దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

కడప కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆకుల వీధిలో ఉన్న రాజరాజేశ్వరిదేవి దేవస్థానం పోస్టర్లను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. సుమారు 500 సంవత్సరాల నుంచి ఆకులవీధిలో రాజరాజేశ్వరిదేవి ఆలయం ఉందన్నారు. మట్లిరాజుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు ఇక్కడ లభించిన సమాచారాన్ని బట్టి తెలుస్తోందన్నారు. ప్రతి సంవత్సరంలాగే దేవదాయశాఖ పరిధిలో గల ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయన్నారు. అమ్మవారిని దర్శించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలక్రిష్ణశర్మ, ఆలయ ఈవో శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ శివయ్య పాల్గొన్నారు.

22 నుంచి దేవునికడపలో..

తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడపలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అలాగే ప్రతిరోజూ సాయంత్రం 7గంటలకు వాహన సేవలు ఉంటాయి.

పాత సామాన్ల ముసుగులో విద్యుత్ మోటర్ల చోరీ.. దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ క్రిష్ణయ్య

గోపవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాత సామాన్లు కొంటాం.. పాత సామాన్లకు చక్కెర ఇస్తాం... అంటూ విద్యుత్ మోటర్ల చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషనులో రూరల్ ఇన్‌స్పెక్టరు క్రిష్ణయ్య విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం ఎల్‌ఆర్‌పల్లెకు చెందిన పాశం రమేశ్ అనే వ్యక్తి పగటి పూట గ్రామాల్లో పాత సామాన్లు కొంటామంటూ సంచరిస్తూ రాత్రి పూట ఎవరూ లేని సమయంలో దొంగతనాలు చేసేవాడు. బద్వేలు, గోపవరం పరిసర ప్రాంతాలైన టి.సండ్రపల్లె, వనంపుల గ్రామాల్లో ఇటీవల విద్యుత్ మోటర్లు దొంగలించాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం శ్రీనివాసపురం సమీపంలో హరిత హోటల్ వద్ద నిందితుని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి మూడు మోటారు బోర్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఇన్‌స్పెక్టరు తెలిపారు. దొంగను అరెస్టు చేయడంలో కృషి చేసిన సీఐ క్రిష్ణయ్య, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందిని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

పోలీసుల అదుపులో నకిలీ పోలీస్

లింగాల,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లింగాల-పులివెందుల మార్గమధ్యలో గురువారం పోలీస్ అంటూ వాహనదారులను ఆపి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని లింగాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై పులివెందుల రూరల్ సీఐ ఎన్వీ రమణ మాట్లాడుతూ దొరిగిల్లు గ్రామానికి చెందిన నగేష్ (రాము) అనే వ్యక్తి సీఐ, ఎస్ఐ అంటూ లింగాలలో వసూళ్లకు పాల్పడుతున్నాడని వాహనదారుల నుంచి ఫిర్యాదు రావడంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని, ఆ సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నాడని పేర్కొన్నారు.

ప్రజా పోరాటాల యోధుడు సురవరం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని భారత మినిస్ట్రీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి తులసిరెడ్డి కొనియాడారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అధ్యక్షతన సురవరం సంస్మరణ సభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిధిలుగా వారు హాజరై మాట్లాడారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాలలో సురవరం పుట్టి పెరిగి కర్నూలులో చదువుకుంటూ ఏఐఎస్ఎఫ్‌లో తొలుత సభ్యుడిగా చేరారన్నారు. విద్యారంగ సమస్యలపై పలు పోరాటాలు చేసి తద్వారా ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజల పక్షాన పలు పోరాటాలు చేశారన్నారు. దున్నేవాడికి భూమి ఇవ్వాలని, ఇంటి స్థలం, ఇంటితో పాటు మౌలిక సదుపాయాలు ప్రాథమిక హక్కుగా భావించి వాటి సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన పోరాట యోధుడు అన్నారు. సీపీఐ నాయకులు చంద్రశేఖర్, గుంటి వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, రామయ్య, వెంకటశివ, బాదుల్లా, సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, మల్లిఖార్జున, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, లోక్‌సత్తా నేత శ్రీక్రిష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వసంతపేట ఎస్‌బీఐ కాలనీలో నివశిస్తున్న ఇంద్రకంటి విజయలక్ష్మి(53) గురువారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. బంధువులు తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా కనబడలేదు. విజయలక్ష్మి కొందరి వద్ద అప్పులు చేసి... వారి ఒత్తిళ్లు తట్టుకోలేక ఇంటి నుంచి వెళ్లినట్లు కుమారుడు వినోద్ వెల్లడించారు. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన రసూల్ (50) బుధవారం తెల్లవారు జాము నుంచి అదృశ్యమయ్యాడు. 16వ తేదీ భార్య భర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో మనస్థాపం చెంది వెళ్లినట్లు డని అతని భార్య రషీదా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

గండికోటకు మళ్లీ కృష్ణాజలాలు

కొండాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు అవుకు రిజర్వాయర్ నుంచి మళ్లీ కృష్ణా జలాలు వస్తున్నాయని ఈఈ ఉమామాహేశ్వర్లు తెలి పారు. ఆదివారం కృష్ణాజలాలను నిలుపుదల చేయగా, మళ్లీ గురువారం 1500 క్యూసెక్కుల నీరు వస్తోం దన్నారు. అదేవిధంగా వాగులు, వంకలు, పెన్నా, చిత్రా వతి నదుల ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 26.411 టీఎంసీల నీటిమట్టం ఉందని ఈఈ తెలిపారు.

సంతృప్తికరస్థాయి సేవలందించాలి : ఎస్ఈ

చక్రాయపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థపై ప్రజల సంతృప్తికరస్థాయి పెంచే విధంగా సేవలు అందించాలని కడప జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ సూచించారు. గురువారం మండలంలోని యర్రగుడిలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలపై వచ్చినపుడు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది, అధికారులు వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తిస్తూ సావధానంగా విని పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు తగినన్ని అందుబాటులో ఉన్నాయని, అవసరమైన ప్రాంతాలలో ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతి తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని, రూ.98వేల వరకు సబ్సిడీ ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలియజేయాలన్నారు. వినియోగదారులు అంతరాయాలు సహించే పరిస్థితిలో లేరని, ముందస్తు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అంతేకాకుండా విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు విధిగా దాడులు నిర్వహించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ



విద్యుత్ షాక్‌కు గురై..పాడిగేదె, దూడ మృతి

రాజుపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో టంగుటూరు గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై పాడిగేదె, దూడ మృతి చెందింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గంగమ్మ అనే మహిళ ఐదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఒక సెంటులో రేకుల ఇల్లు వేసి.. అందులోనే పాడిగేదెను పెట్టుకొని వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటికి లాగిన కరెంటు తీగ తెగి రేకుల షెడ్డు మీద పడడంతో విద్యుత్ పాసై ఈ ప్రమాదం జరిగింది. పాడిగేదకు బీమా వర్తించని పశువుల అధికారులు తెలపడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై గళం వినిపించాలి

● డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శాసనసభలో ప్రజా సమస్యలపై గళం వినిపించే విధంగా సిద్ధం కావాలని జనసేన రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ సూచించారని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. గురువారం అమరావతిలోని జనసేన శాసనసభ కార్యాలయంలో జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు అభివృద్ధి కార్యక్రమాలపై సభా దృష్టికి తీసుకురావాలని అధ్యక్షుడు సూచించినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై గుర్తించి వాటి పరిష్కారం కోసం శాసనసభలో సమర్థవంతంగా ప్రస్తావించేందుకు తగిన సన్నాహాలు చేసుకోవాలని స్పష్టం చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

రామాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గర్భవతులు, తల్లులు, కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలని డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. రామాపురంలోని పీహెచ్‌సీలో బుధవారం స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భవతులు, తల్లులు, కిశోర బాలికలకు అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రేఖానాయక్, సూపర్‌వైజర్లు ఉమామహేశ్వరి, సుబ్బయ్య కృష్ణపర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బైరాన్‌చెరువు పునర్నిర్మించాలని వినతి

సుండుపల్లె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెగిన బైరాన్ చెరువు మొరవను పునర్నిర్మాణం చేయాలని పత్తివాండ్లపల్లికి చెందిన యర్రపురెడ్డి హరినాథరెడ్డి గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అలాగే బైరాన్‌చెరువు నుంచి రాతిచెరువు వరకు ఆక్రమణలు జరగడం వలన వరద నీరు పత్తివాండ్లపల్లెలోకి వచ్చి ఇళ్లు జలదిగ్బంధం అయ్యాయని పేర్కొన్నారు. చెరువు మొరవ దిగడం వలన సర్వే నెంబరు 1695, 1655లలో సాగు చేసిన కూరగాయ తోటలు, మామిడి తోటల్లోకి నీరు ప్రవహించి పంట, ఆస్తి నష్టం జరిగిందని తెలియజేశారు. ఇరిగేషన్ ఏఈ, తహసీల్దార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా వారు స్పందించలేదని ఆరోపించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

గాలివీడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి అన్నారు. గురువరం స్థానిక ఆర్ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఎస్ఐ రామకృష్ణ కలిసి సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయని, పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పొదుపు నిధులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వీరబల్లి గ్రామ సమాఖ్య-2 కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు పొదుపు నిధులను సద్వినియోగం చేసుకోవడం వల్ల సంఘ నిధి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ నాగేంద్ర, వీవోఏ కవిత, సమాఖ్య అధ్యక్షురాలు సుధారాణి, కార్యదర్శి నాసిరున్, కోశాధికారి ఇంద్రావతి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దాతృత్వం అభినందనీయం

పెనగలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు పూర్వ విద్యార్థి రూ.లక్ష వ్యయంతో నీళ్లట్యాంకును నిర్మించి స్వచ్ఛమైన తాగునీరు అందించడం అభినందనీయమని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర అన్నారు. గురువారం పెనగలూరు ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అల్లం మహేశ్వర్‌నాయుడు అధ్యక్షతన ఈ పాఠశాల పూర్వ విద్యార్థి కొడిదెల సుబ్రమణ్యం రూ.లక్ష నిధులతో నిర్మించిన నీళ్ల ట్యాంకు ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో విజయరావు, జనసేన నేతలు కె.సాయికుమార్, కె.వినీత్‌రాయల్, హరిబాబురాయల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం వాహనాల వేలం

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలు వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. కోడూరు ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 20న నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం

● మొక్కలు నాటిన డీఆర్‌వో మధుసూదన్‌రావు



మొక్కలు నాటుతున్న డీఆర్‌వో

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో మేదరి వెదురు వృత్తిదారుల సంక్షేమ, అభివృద్ధి సంస్థ అభ్యర్థన మేరకు డీఆర్‌వో కె.మధుసూదన్‌రావు వెదురు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబరు 18న ప్రపంచ వెదురు దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అంతకు ముందు మేదరి వెదురు వృత్తిదారుల సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వృత్తిదారులకు రాయితీపై వెదురు మంజూరు చేయాలని, వెదురు యంత్ర పరికరాలు, వెదురు డిపో యూనిట్లకు సబ్సిడీల మంజూరుతో రాయచోటి పట్టణంలో వెదురు క్లస్టర్ ఏర్పాటు చేయాలని వృత్తిదారుల సంక్షేమ సంఘం సభ్యుడు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో వెదురు మొక్కలు నాటి వాటికి రక్షణగా వెదురుతో తయారు చేసిన ట్రీ గార్డ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, రహదారులు భవనాల శాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాల వంటి వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద వెదురు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి గుజపనేని రెడ్డెయ్య, డైరెక్టర్స్ గుజపనేని వెంకటసుబ్బయ్య, ఆర్ల నాగరాజు, టంగుటూరి నాగార్జున, ప్రోగ్రాం అధికారులు వెంకటజయప్రసాద్, నరసింహులు, ఎల్లయ్య, వెంకటచలపతి, కోలే గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ పీజీలో 202వ ర్యాంక్



తల్లిదండ్రులతో ఎంబీబీఎస్ పట్టాను తీసుకుంటున్న కొండారెడ్డి

గాలివీడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నూలివీడు పంచాయతీకి చెందిన నక్కల కొండారెడ్డి అనే యువకుడు మెడిసిన్ పీజీలో రాష్ట్ర స్థాయిలో 202వ ర్యాంకు సాధించాడు. ఇతను స్థానిక నూలివీడులోని శ్రీసరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో పదవ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. అనంతరం ఇంటర్మీడియట్‌లో బైపీసీ తీసుకొని ఎస్వీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. అనంతరం పీజీకి ఎంట్రన్స్ రాయగా బుధవారం ప్రభుత్వం ఫలితాలను ప్రకటించింది. ఫలితాల్లో ఆ యువకుడు 202వ ర్యాంకు సాధించారు. మారుమూల రైతు కుటుంబంలో జన్మించిన కొండారెడ్డి పీజీ మెడిసిన్‌లో మంచి ర్యాంకు సాధించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు రఘునాథరెడ్డి, చంద్రకళ నిత్యం వ్యవసాయం చేసుకుంటూ కుమారుని ఉన్నత చదువులు చదివించారు. కాగా తాను పీజీలో పీడియాట్రిక్ (చిన్నపిల్లల వైద్యం) కోర్సును తీసుకోనున్నట్లు అతను తెలిపారు.

దివ్యాంగుల కుటుంబాలను ఆదుకోవాలి

- దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడారు. దివ్యాంగుల కుటుంబాలను రోడ్డున పడకుండా కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అయితే ఇటీవల కొన్ని కారణాలతో కూటమి ప్రభుత్వం బోగస్ వికలాంగుల పింఛన్లపై దృష్టి సారించిందన్నారు. ఈ క్రమంలో బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్న దివ్యాంగులను తొలగించి నిజమైన దివ్యాంగులకు పింఛన్లు ఇస్తారని ఆశిస్తున్నామన్నారు.

ప్రభుత్వ విద్యారంగం బలహీనపడుతుంది

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు చేసుకున్న ఒప్పందం స్టాల్ పథకం వల్ల పాఠశాల ప్రభుత్వ విద్యారంగం బలహీనపడుతుందని రాష్ట్ర యూటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న యూటీఎఫ్ రణభేరి గురువారం ఒంటిమిట్టకు చేరుకుంది. కొత్తమాధవరం పాఠశాల నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని తక్షణం రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని, అలాగే ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, జబీర్, క్రిష్టారెడ్డి, గోపినాథ్, విశ్వనాథ్, సుబ్బరాయుడు, బ్రహ్మయ్య కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడకు విద్యార్థులు

రాజంపేటటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడకు రాజంపేట మండలం పెద్దకారంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు గురువారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర తెలిపారు. జిల్లా నుంచి క్రీడా పోటీల్లో అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని వరదరాజు వర్షిత, అండర్-17 విభాగంలో పదో తరగతి విద్యార్థి కడుమూరి మిథున్‌వర్మ రగ్బీ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.పార్థసారథి, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



రగ్బీ క్రీడకు ఎంపికైన పెద్దకారంపల్లె విద్యార్థులు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

● నియోజకవర్గ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం సిద్దవటం మండలం టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారికి తాను అండగా ఉంటానన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు పనిచేయాలన్నారు. మండలంలో కష్టపడే కార్యకర్తలకు పార్టీలో 8 సముచిత స్థానాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ వీరభద్రుడు, మండల నాయకులు జవహర్‌బాషా, దశరథరామానాయుడు, సంజీవరెడ్డి, గౌస్‌పీర్‌తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యరాల దేవస్థానం చైర్మన్‌గా నాగమణి

రాజంపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన హత్యరాల దేవస్థానం చైర్మన్‌గా పూల నాగమణిని నియమిస్తూ దేవదాయ శాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా ముమ్మడి చిన్నయ్య, రమాదేవి, రమేష్, భారతి, వెంకటేశ్వర్లు, వేణుమాధవ్, నరసింహులును ఎంపిక చేశారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా పద్మనాభశాస్త్రిని ఎంపిక చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి సభ్యులు జగన్‌మోహన్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

ధర్నాను జయప్రదం చేయండి

● యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఈ నెల 20న జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ అరియర్స్‌ను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూఈఈడబ్ల్యుయూ డిస్కమ్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, డివిజన్ అధ్యక్షుడు నగేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కోడూరు పట్టణంలో ఘనంగా యూటీఎఫ్ రణభేరి కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి, పీఆర్సీ అమలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని, 117 జీవోను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, కార్యదర్శి బి.లక్ష్మీరాజా, ఎస్.జయచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.జబీర్, మండల అధ్యక్షుడు ఎన్.మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

చిట్వేలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని, ఒకరికొకరు తోడుగా నిలిచి ముందుకు వెళ్లాలని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ నేత అతికారి కృష్ణ వెల్లడించారు. గురువారం చిట్వేలి మండలంలో బలిజసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి మస్తాన్‌రాయల్ ఆహ్వానం మేరకు అన్నమయ్య జిల్లా బలిజసేన అధ్యక్షుడు కేఎస్ నరసింహ, అతికారి కృష్ణకు బలిజసేన కార్యాలయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారికి శాలువాలు కప్పి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అబ్బిగారి గోపాల్, మాదాసు శివ, జనసేన పార్టీ మైనార్టీ నాయకులు రియాజ్, మద్దూరి మన్మధ, మిత్రబృందం, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈక్రాప్ చేయించుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శివనారాయణ

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంటసాగు చేసిన ప్రతి రైతు ఈక్రాప్ బుకింగ్ తప్పకుండా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుడ్డవారిపల్లె, అనంతపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ వివరాలను సకాలంలో నమోదు చేయించుకోవాలని పంట వివరాలు సమగ్రంగా ఉంచాలన్నారు. సహజ వ్యవసాయాన్ని అనుసరించడం ద్వారా పంటల ఉత్పాదికత పెరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజకుమారి, ఏఈవో అనూష, సేంద్రియ వ్యవసాయ అధికారులు సరస్వతి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోడూరు మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు లక్ష్మికర్ కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీఆర్‌ఏ సమస్యలపై తక్షణమే న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో తమ హక్కుల కోసం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం రైల్వేకోడూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోని వీఆర్‌ఏ సంఘం నాయకులు, సహాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

● సీడీపీవో రాజమ్మ

సుండుపల్లె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో రాజమ్మ తెలిపారు. గురువారం మండలంలోని రాయవరం హరిజనవాడ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించాలని తెలియజేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

● సుగవాసి ప్రసాద్‌బాబు



మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన పట్టణంలోని గాలివీడు రోడ్డులో నూతనంగా నిర్మించిన గంగమ్మ గుడి ప్రాంగణంలో అన్నమయ్య జిల్లా మేదర సంఘం ఆహ్వానం మేరకు వెదురు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మనిషి మనుగడకు ఇబ్బందికరంగా ఉన్న ప్లాస్టిక్ వస్తువులను తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేదర సంక్షేమ సంఘం నేతలతో పాటు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాలను దేవదాయశాఖలో చేర్చాలి

● జిల్లా అధికారికి జనసేన నేత వినతి

సుండుపల్లె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద బలిజపల్లె రామాలయం, కొత్తపురమ్మ ఆలయాలను దేవదాయ ధర్మాదాయశాఖ పరిధిలోకి చేర్చాలని కోరుతూ జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథంకు జనసేన నేత రామా శ్రీనివాసులు ఆలయాల ధర్మకర్తలు, పూజారులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆలయాలను తమ గ్రామస్థులు విరాళాల ద్వారా నిర్మించుకుని ప్రతిరోజు దీపారాధన, పూజలు నిర్వహించడంతో పాటు ప్రతి ఏడాది ఉత్సవాలను నిర్వహిస్తున్నామని విన్నవించారు.

ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలి

- ఏపీడీ లక్ష్మీనరసయ్య

సుండుపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ లక్ష్మీనరసయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో అన్ని గ్రామాల అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు వేగవంతం చేసి లక్ష్యం సాధించాలంటే కూలీల సంఖ్య పెరగాలని సూచించారు. అలాగే మండల వ్యాప్తంగా మరో వంద ఎకరాల గడ్డి పెంపకం చేయాలన్నారు. అలాగే మండలంలో జరుగుతున్న వాటర్ షెడ్ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మాలిక్ బాషా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

12వ పీఆర్సీని కార్మికులకు వర్తింపజేయాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాజంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీ వర్తింపజేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన 17 రోజుల సమ్మెకు వేతనం ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య రీత్యా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు 12వ పీఆర్సీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం పీఆర్సీని అమలు చేసి తమ జీవితాల్లో మార్పులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కె.ప్రసాద్, లక్ష్మీదేవి, ఎంవీ రమణ, కోదండ సురేష్ పాల్గొన్నారు.

స్టాల్ పథకాన్ని రద్దు చేయాలి: యూటీఎఫ్

రాజంపేటటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచబ్యాంకుతో గత రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందంలో భాగంగా స్టాల్ పథకం చేశారని దీనివల్ల ప్రభుత్వ విద్యారంగం బలహీనపడుతుందని తక్షణం దీన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ చేపట్టిన రణభేరి కార్యక్రమం రెండో రోజు గురువారం రాజంపేట పట్టణంలో యూటీఎఫ్ నేతలు భువనగిరిపల్లె ఆర్చి నుంచి ఎన్జీవో హోం వరకు బైకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సహాయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జాబీర్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

● డాక్టర్ మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి



బీమా అందజేస్తున్న లక్ష్మిప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మిప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని సంబేపల్లె మండలం పీఎస్‌కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త జల్లా నాగరాజు అకాల మరణంతో వారి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున రూ.5 లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంబేపల్లె మండలంలోని పీఎస్‌కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త జల్లా నాగరాజ పార్టీకి ఎనలేని సేవ చేసి అకాల మరణం పొందడం పార్టీకి తీరని లోటన్నారు. కాగా బాధితులు సీఎం చంద్రబాబు, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అత్యవసరమా.. అవతలికెళ్లు..!

- సమయపాలన పాటించని వైద్యులు
- ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లోనే
- సామాన్య రోగులకు తప్పని తిప్పలు
- సీజనల్ వ్యాధులతో ప్రజల ఇబ్బందులు
- ఇదీ రాయచోటి ఏరియా ఆసుపత్రి తీరు



రాయచోటిటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ప్రతి రోజు 800 నుంచి 900 వరకు ఓపీ ఉంటోంది. పట్టణానికి చెందిన వందలాది మంది పేదలు ప్రతిరోజు ఏరియా ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారు. అయితే ఆసుపత్రిలో పనిచేస్తున్న చాలా మంది వైద్యులు ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లో గడుపుతుండడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఆసుపత్రికి వచ్చే జనరల్ వైద్యుల్లో కొంత మంది ఓపీ చూడకుండా కేవలం ఆపరేషన్లకే పరిమితం అవుతున్నారు. అలాగే స్త్రీల శస్త్ర చికిత్స విభాగం, పురుషుల శస్త్ర చికిత్స విభాగాల్లో వైద్యులు అంతంత మాత్రమే విధులకు హాజరవుతుండడంతో చాలా మంది రోగులు సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

పని ఇక్కడ.. నివాసం వేరేచోట

రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, పీలేరు, పులివెందుల నియోజకవర్గాల్లోని వీరబల్లి, సుండుపల్లె, కేవీపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ, చక్రాయపేట, సత్యసాయి జిల్లాలోని కదిరి, ఎన్పీ కుంట తదితర మండలాల నుంచి కూడా ఎంతో మంది పేద రోగులు రాయచోటి ఏరియా ఆసుపత్రికి వైద్యంకోసం వస్తుంటారు. వైద్యులు పనిచేసేచోటే నివాసం ఉండాలనే నిబంధన ఉంది. అయితే ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు కొంతమంది కడప, పీలేరు నుంచి విధులకు హాజరవుతుండటంతో వీరు సమయానికి రావడం లేదని అంటున్నారు. రాయచోటి ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు గానూ ప్రస్తుతం 21 మంది ఉండగా ఒక జనరల్ మెడిసిన్, ఒక ఆర్థోపెడిక్ వైద్యుల కొరత ఉంది.

ఆర్థోపెడిక్ డాక్టర్ లేక..

రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు చికిత్స అందించాల్సిన ఆర్థోపెడిక్ డాక్టర్ లేకపోవడంతో ఎమర్జెన్సీ వైద్యం అందక సామాన్య రోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తిరుపతి, వేలూరు, బెంగళూరు ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఇటీవల వినాయక చవితి సందర్భంగా వినాయకుడి విగ్రహాల ఏర్పాటు పరిశీలనకు వెళ్లిన ప్రసాద్ అనే కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై రాయచోటి ఏరియా ఆసుపత్రికి వచ్చారు. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు వెళ్లారు. దీనికి తోడు సీజనల్ వ్యాధులతో అల్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన కొంతమంది సీనియర్ వైద్యులు కేవలం ఆపరేషన్లకు పరిమితం అవుతుండడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపు చూస్తున్నారు.

> అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో 100 పడకల ఏరియా ఆసుపత్రి ఉన్నప్పటికీ.. ఇక్కడ ఎమర్జెన్సీ వైద్యసేవలు అందడం లేదు. అత్యవసరం అంటూ ఎవరు పోయినా వేరే ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. దీనికితోడు ప్రస్తుతం జనాన్ని వేధిస్తున్న సీజనల్ వ్యాధులకూ వైద్యసేవలు సరిగా అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. దీనికి కారణం ఇక్కడ పనిచేసే వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో పాటు ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లో గడుపుతుండటమే.



సీజనల్ వ్యాధులతో ఓపీ వద్ద బారులుతీరిన రోగులు

ప్రహరీ గోడ కూలిపోయి..

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన 100 పడకల ఆసుపత్రికి పడమర భాగంలో ఉన్న పాత ప్రహరీగోడ వర్షాలకు కూలిపోయింది. దీంతో ఆసుపత్రి ఆవరణం పశువులు, కుక్కలకు ఆవాసంగా మారింది. మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు పడమర వైపు నుంచి ఆసుపత్రి ఆవరణలోకి ప్రవేశిస్తుండడంతో రాత్రి సమయాల్లో ఇక్కడ ఉండే రోగులకు రక్షణ లేకుండా పోయింది. దీనికి తోడు ఆసుపత్రి రోగులకు, సిబ్బందికి నీటి కొరత కూడా వెంటాడుతోంది. కూలిపోయిన ప్రహరీగోడను త్వరగా పూర్తి చేసి పశువులు, కుక్కలు, మందుబాబులు ఆసుపత్రిలోకి ప్రవేశించకుండా చూడాలని పట్టణ ప్రజలు, రోగులు, ఆసుపత్రి సిబ్బంది కోరుతున్నారు.

రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్

వైసీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మించినప్పటికీ ఎమర్జెన్సీ కేసులకు అవసరమైన క్రిటికల్‌కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో సకాలంలో సరైన ఎమర్జెన్సీ వైద్యం అందక కొందరు కాళ్లు, చేతులు పోగొట్టుకొని వికలాంగులైన దాఖలాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాయచోటి ఏరియా ఆసుపత్రికి రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేయించడమే కాకుండా ఇటీవలనే దీని నిర్మాణానికి భూమిపూజ కూడా చేపట్టారు. 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాద బాధితులకు ఇక్కడే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం



వివిధ ప్రాంతాల నుంచి రాయచోటి ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రతి రోజు 800 నుంచి 900 వరకు ఓపీ నడుస్తోంది. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు గానూ 21 మంది ఉన్నారు. ఒక జనరల్ మెడిసిన్, ఒక ఆర్థోపెడిక్ వైద్యులు రావాల్సి ఉంది. ప్రస్తుతం నీటికొరత లేదు. ఆసుపత్రికి పడమర భాగంలో ప్రహరీ గోడ నిర్మించాల్సి ఉంది. 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తయితే ఎమర్జెన్సీ వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయి.

- డేవిడ్ కుమార్, సూపరింటెండెంట్, రాయచోటి ఏరియా ఆసుపత్రి

ఐదు బార్లకు లైసెన్సులు కేటాయింపు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ఐదు బార్లకు లక్కీడిప్ ద్వారా లైసెన్సులు కేటాయించామని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఐదు బార్లు మంజూరు కాగా వాటిలో నాలుగు బార్లకు ఇది వరకే కలెక్టర్ లక్కీడిప్ ద్వారా కేటాయించారన్నారు. మిగిలిన ఒక బార్‌కు గురువారం రాయచోటిలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి చలపతినాయుడుకు లైసెన్సు మంజూరు చేశారన్నారు. బి.కొత్తకోటలో ఒక బార్‌కు ఈడిగ కులానికి కేటాయించగా కుడుము ఆదిత్యకు లైసెన్సు దక్కిందన్నారు.

'బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి'

పీలేరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. తిరుమల పర్యటనకు వచ్చిన గవర్నర్‌ను బుధవారం రాత్రి కలిసిన డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, రాజ్ కుమార్, మునీంద్ర నాయక్ వినతి పత్రం అందించారు. టీటీడీ షాపింగ్ కాంప్లెక్సులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని, ఉద్యోగాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు జారీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నలుగురికి ఏపీడీ నందకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మెమోలు జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఏపీఓ సుధాకర్ తెలిపారు. గురువారం ఉపాధి కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఏపీడీ సమీక్షించారు. తుమ్మరకుంట ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, బూర్లపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు, అంకిరెడ్డిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ ఆదినారాయణ, మడుమూరు ఫీల్డ్ అసిస్టెంట్ భార్గవ్ సమావేశానికి కనీస సమాచారం ఇవ్వకుండా హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు వారిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మెమోలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

రుషివాటిక పాఠశాలకు నోటీసు

బి.కొత్తకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ గట్లపై నిర్వహిస్తున్న రుషివాటిక ఆశ్రమ పాఠశాలకు విద్యాశాఖాధికారులు నోటీసు జారీచేశారు. వేదభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ఇటీవల జరిగిన ఘటనలో లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన విద్యార్థి శేషాద్రి తీవ్రంగా గాయపడి కనుచూపు కోల్పోవడం, దీనిపై బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ పాఠశాల నిర్వాహకులు అందజేసిన వివరాల మేరకు హోం స్కూలింగ్‌కు అనుమతులు లేవని, విద్యార్థులకు తాత్కాలిక సాంస్కృతిక శిక్షణ ఇస్తున్నట్లు యాజమాన్యం పేర్కొందని విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. అలాంటి హోం స్కూలింగ్‌కు అనుమతులు లేవని, జీఓ ఎంఎస్ నెంబర్1, ఎడుకేషన్ (పీఎస్)01-01-1994 ప్రకారం ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాతే నిర్వహించాలని, లేని పక్షంలో నిర్వాహకులపై తగు చర్యలకు సిఫారసు చేస్తామని ఎంఈవో రెడ్డిశేఖర్ పాఠశాల సిబ్బందికి నోటీసు జారీచేశారు.

559 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పుల్లంపేట/రాజంపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలాల్లో మండల పరిధిలోని జాగువారిపల్లె పంచాయతి సాదువారిపల్లె సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 309 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకుని సీజ్ చేసినట్లు తహశీల్దారు పుల్లారెడ్డి తెలిపారు. కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన కేఏ56 3519 నంబరు లారీలో ప్రజా పంపిణీకి చెందిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు.

దీంతో రైల్వేకోడూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసులు పరిశీలించి 309 బస్తాల (15.45 క్వింటాళ్ల)ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్ క్రాంతికుమార్‌ను అరెస్ట్ చేసి లారీని పుల్లంపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని రాజంపేట స్టాకు పాయింట్‌కు తరలించినట్లు తహశీల్దారు తెలిపారు.

అలాగే.. రాజంపేట మండల పరిధిలోని మిట్టమీదపల్లె గ్రామ శివారులో గురువారం గుట్టపై నిల్వ ఉంచిన 250 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా తరలించవద్దని, లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని రాజంపేట డిపోకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



రాజంపేట : గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం - పుల్లంపేట : పట్టుబడిన రేషన్ బియ్యం లారీతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చికిత్సను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై

గాలివీడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పశువైద్యులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం కుమ్మరపల్లిలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్‌లో భాగంగా పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 35 ఎదకు రాని పశువులను, 25 పశువులకు సాధారణ పరీక్షలు, 62 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. అంతేగాక గొంతువాపు నివారణ టీకాలు వేయడం, దూడలకు నట్టల నివారణ మందులు తాపామన్నారు. అనంతరం పాడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు మాలకొండయ్య, సహాయ సంచాలకులు శివారెడ్డి, స్థానిక పశువైద్యులు నాగరాజు, సిబ్బంది శశికళ, లక్ష్మీనారాయణ, హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ.. స్థానికుల నిరసన



ప్రభుత్వభూమి కబ్జా చేశారని నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని విశ్రాంత లెక్చరర్ వెంకటరమణ ఆక్రమించారని గ్రామస్థులు గురువారం స్థలంలో నిరసన చేపట్టారు. మదనపల్లె మండలం, కొత్తవారిపల్లె పంచాయతీ, ఎనుములవారిపల్లె గ్రామదేవత గంగమ్మ ఆలయం ముందర ప్రభుత్వ స్థలాన్ని అక్రమించారని ఆరోపించారు. దీని పక్కనే ఉన్న భూమిని వెంకటరమణ కొనుగోలు చేశారని, దాంట్లోకి కలిపేసుకునేందుకు ప్రభుత్వ భూమిని చదును చేసినట్లు గ్రామస్థులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సర్వే చేసి ఇది ప్రభుత్వ భూమిగా తేల్చారని గ్రామస్థులు వివరించారు. ఈ విషయమై ఆయనను వివరణ కోరగా ఈ స్థలం పక్కనే భూమిని కొనుగోలు చేశానని, ఇల్లు కట్టుకుంటే రోడ్డుపై నేను ఏలా వెళ్లాలని ప్రశ్నించారు. సర్వేలో ఎలా తేలితే అలా నడుచు కుంటానన్నారు.

నేటి నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

కలికిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ నిరసనకు దిగుతున్నట్లు స్థానిక డాక్యుమెంట్ రైటర్లు తెలిపారు. దీని కారణంగా వీరు ఎలాంటి దస్తావేజులు తయారు చేయరు. రాష్ట్ర సంఘం ఈ మేరకు సమాచారమిచ్చినట్లు చెప్పారు. ఆస్తుల కొనుగోలు, అమ్మకాల వ్యవహారాలను సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో పూర్తి చేయడానికి డాక్యుమెంట్ రైటర్లు దస్తావేజులను తయారు చేస్తారు. దీనికి అనుబంధంగా ఈ మొత్తం లావాదేవీల వివరాలను ఇంగ్లీషులో పబ్లిక్ డాటా ఎంట్రీ (పీడీఈ) పేరుతో డిజిటల్ డాక్యుమెంట్‌ను కూడా వీరు తయారు చేసి దస్తావేజుతోపాటు పీడీఈని కూడా రిజిస్ట్రేషన్ కోసం సమర్పించాల్సి ఉంది. అయితే పీడీఈ డిజిటల్ డాక్యుమెంట్‌లో ఏవైనా సవరణలు అవసరమైతే దస్తావేజులోని వివరాల ఆధారంగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ఉద్యోగులు దాన్ని సవరించే (కరెక్షన్) వెసులుబాటు ఉండేది. అయితే ఇటీవల సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో కరెక్షన్ చేసే వెసులుబాటును తొలగించారు. పీడీఈలో ఏ చిన్నపాటి సవరణకైనా ముందు తయారు చేసిన డిజిటల్ డాక్యుమెంట్‌ను పూర్తిగా తొలగించి తిరిగి మొత్తం తయారు చేయాల్సి ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ల తీవ్రమైన కాలయాపన జరుగుతోందని రైటర్లు చెపుతున్నారు. ఆస్తుల కొనుగోలు అమ్మకందార్లు పదే పదే వారి మొబైల్ ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను రైటర్లకు చెప్పాల్సి ఉంది. చాలా మంది ఫోన్ నంబర్లు ఆధార్ కార్డుకు అనుసంధానం కాకపోవడంతో దీన్ని కూడా పూర్తి చేస్తేగానీ ఓటీపీలు వచ్చే అవకాశం లేదు. దీంతోపాటు మరికొన్ని సమస్యలు పరిష్కారించాల్సిందిగా కోరుతూ పెన్‌డౌన్ నిరసన చేపట్టి శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్లను బహిష్కరిస్తున్నట్లు రైటర్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థినులు

నందలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపారు. కడప స్పోర్ట్స్ స్కూల్, పులివెందులలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19, అండర్-17, 14 రగ్బీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరి గురువారం మాట్లాడుతూ జి.గురుస్నేహలత (ఇంటర్మీడియట్), పి.లక్ష్మీస్పందన(10వ తరగతి), వై.నవ్యశ్రీ(9వ తరగతి), వై.మహిమ(9వ తరగతి) రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులు క్రీడల్లో రాణించడానికి కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు కేజీ సునీతకు ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలి : కలెక్టర్

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో తహశీల్దార్లు, ఎంపీడీవో వివిధ శాఖల, మండల స్థాయి సిబ్బంది తదితరులతో రెవెన్యూ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, వ్యవసాయం, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, విద్యుత్, పర్యాటకం తదితర అంశాలపై ఆయన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ప్రారంభించిన రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకం, దీపం, తల్లికి వందనం, వంటి పథకాలపై వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో ఈకేవైసీ పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించారు. స్త్రీశక్తి పథకంలో బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో తదితర అంశాలపై ఆర్టీసీ అధికారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాలపై సమీక్షిస్తూ స్మార్ట్‌కార్డుల పంపిణీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా హౌసింగ్, ఉద్యానవనశాఖ, పంచాయతీరాజ్, చెత్తసేకరణపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రీసర్వే, పర్యాటకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శాఖల ప్రాధాన్యత అంశాలపై మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైలుకింద పడి యువకుడు మృతి



జయసింహ (ఫైల్)

నందలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె గ్రామానికి చెందిన కాశిగారి జయసింహ(26) అనే యువకుడు రైలుకింద పడి మృతిచెందాడు. మృతుని బంధువుల వివరాల మేరకు.. కాశిగారి పెంచలయ్య, సరస్వతి దంపతుల ప్రథమ కుమారుడైన జయసింహ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఉపాధి నిమిత్తం బెంగుళూరు వెళ్లి మూడు రోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చాడు. కాగా గురువారం సాయంత్రం యువకుడు స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. యువకుడు మృతితో వారి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సంఘటనపై సీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

లారీ బోల్తా.. డ్రైవర్లకు గాయాలు



బోల్తా పడిన టమోటాల లారీ

ములకలచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలో గురువారం తెల్లవారుజామున టమోటా లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు నుంచి చత్తీస్‌ఘడ్‌కు టమోటాలు తీసుకెళ్తున్న లారీ తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో ఎదురుగా వస్తున్న ఓ ప్రవేటు బస్సు మీదకు దూసుకురావడంతో తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన డ్రైవర్లు సయ్యద్‌బాషా, షబ్బీర్ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. లారీ బోల్తాపడడంతో అందులో ఉన్న టమోటాలు నేలపాలై తీవ్ర నష్టం వాటిల్లింది.

చికిత్సపొందుతూ మహిళ మృతి



శోభారాణి (ఫైల్‌ఫొటో)

కలకడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శోభారాణి(34) మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వాల్మీకిపురం మండలం దయ్యాలబండ వాసి వెంకటరమణ భార్య శోభారాణి ఈ నెల 14న సొంత పనుల నిమితం కలకడకు వచ్చి తిరిగి గుర్రంకొండకు ద్విచక్ర వాహనంలో బయలుదేరింది. కదిరాయచెరువు సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి కిందపడడంతో తలకు గాయమైంది. గాయపడిన మహిళను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

భూతగాదాలో ఘర్షణ.. ఇరువర్గాలపై కేసు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఘర్షణ పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతీ నల్లంవారిపల్లి వాసులు శ్రీనివాసులు అతని భార్య భువనేశ్వరి దాయాదులైన రెడ్డెప్ప, అంజమ్మలకు భూమి విషయమై ఘర్షణ జరిగింది, దీంతో ఒకరినొకరు కొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి అమ్మ కొడుతోంది
ఫిర్యాదు చేసిన పిల్లలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి రోజూ తమను అమ్మ కొడుతోందని, అమ్మపైన ఆమెకు మద్యం తెచ్చిచ్చే వ్యక్తిపైనా చర్యలు తీసుకోవాలని పిల్లలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిల్లల కథనం మేరకు..

మదనపల్లె పట్టణం, బాలజీ కాలనీలో కాపురం ఉంటున్న లక్ష్మన్న, వాణీ దంపతులకు టెన్త్, ఏడోవతరగతి చదివే ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మన్న యాక్సిడెంట్ కేసులో జైలుకు వెళ్లి శిక్ష అనుభవిస్తున్నాడు. ఏడాదిగా వాణి మద్యానికి బానిసయ్యారు. ఆమెకు ఆటో డ్రైవర్ రెడ్డి నిత్యం మద్యం తెచ్చి ఇస్తున్నాడు. మద్యం తాగి తరువాత ఆమె ఇంట్లో సంగటి కర్రతో రోజూ తమను విచక్షణారహితంగా కొడుతోందని పిల్లలు తెలిపారు. ఆదే వీధిలో ఉన్న ప్రదీప్, మోహన్‌రాజ్ పిల్లలను కాపాడే ప్రయత్నం చేయగా వారిపైనా ఆమె దాడికి దిగారు. దీంతో గురువారం పిల్లలిద్దరూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం వీరిద్దరూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉల్లి రైతు కన్నీరు...

● ధర పతనంతో ఆవేదనలో అన్నదాతలు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని నానుడి. అలాంటి ఉల్లి పంట సాగు చేసిన రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక కన్నీరు కారుస్తున్నారు. ఆరుగాలం శ్రమించి దిగుబడి చేతికందే సమయంలో బహిరంగ మార్కెట్‌లో ధర పతనం కావడంతో దిగాలు చెందుతున్నారు. ఒకవైపు అధికవర్షాలు మరోవైపు మార్కెట్‌లో ధర పతనంతో ఉల్లి రైతుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. పంటకు గిట్టుబాటు



వీరపునాయునిపల్లెలో కోత కోసి మార్కెట్‌కు తరలించేందుకు ఉంచిన ఉల్లిగడ్డలు

ధర లేకపోవడంతో కొందరు రైతులు పొలాల్లోనే గొర్రెలు, మేకలు, పశువులకు వదిలేస్తున్నారు. క్వింటా 600 రూపాయలకు ధర పడిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 4089 ఎకరాలలో రైతులు ఉల్లిపంటను సాగు చేశారు. అంకిరెడ్డిపల్లె, కొమ్మద్ది, బుసిరెడ్డిపల్లె, అడవిచెర్లోపల్లె, వెల్దుర్తి, వెంకటాపురం, వీఎన్‌పల్లె, అనిమెల, యు.రాజుపాలెం, తాటిమాకులపల్లె గ్రామాలలో రైతులు అధికంగా సాగుచేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉల్లి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

ధర లేదని... అధైర్యపడకండి

సింహాద్రిపురం, సెప్టెంబరు 18: మండలంలో ఉల్లి సాగు చేసిన రైతులు ధర లేదని అధైర్యపడవద్దని మండల ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం రావులకొలను పంచాయతీలోని అహోబిళం గ్రామానికి చెందిన రైతు అంకాల్‌రెడ్డి ఉల్లి గడ్డలను గ్రామస్తులకు ఉచితంగా ఇవ్వడంతో పాటు మిగిలిన వాటిని ఆరుబయట పారవేయడంతో హెచ్‌ఓ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవనశాఖ అధికారి మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం నుంచి జీఓ రాగానే మార్క్‌ఫెడ్ ద్వారా కిలో రూ.12లు ధరతో కొనుగోలు చేస్తామని తెలిపారు. ఉల్లి రైతులు ఇ-పంటలో నమోదు చేసుకున్నట్లయితే ప్రతి రైతుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్, ప్రభుత్వం ఇచ్చే ప్రత్యామ్నాయ ప్రోత్సాహకాలు వర్తిస్తాయన్నారు.

ఆందోళన వద్దు

ప్రభుత్వం ఆదుకుంటుంది :కలెక్టర్

ఖాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర లేదని ఉల్లి రైతులు ఆందోళన చెందవద్దని.. ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన మండలంలో వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నూర్పిడి చేసిన ఉల్లి పంటను వర్షాలకు భయపడి నిలువ ఉంచుకోలేక తక్కువ ధరకు రూ.5-6లకే అమ్ముకోవాల్సి వస్తోందని, వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని, ఉల్లిపంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, తహసీల్దారు ఏవీ రమణమ్మ, వ్యవసాయశాఖాధికారి నాగార్జున, సీఐ వంశీధర్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్యం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



ఉల్లి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

నాసిరకం విత్తనాలతో నష్టపోయాం..

● న్యాయం చేయాలని రైతుల వేడుకోలు



మొక్కజొన్న కంకులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ముద్దనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాసిరకం విత్తనాలతో నష్టపోయాం.. మమ్ములను ఆదుకోవాలని మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు శాస్త్రవేత్తలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధి శెట్టివారిపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను కడప డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు వెంకటపతి, డాక్టర్ క్రిష్ణప్రియ, శ్రీవల్లి, మాధురి, యాస్మిన్ బృందం, వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమగోడు వెల్లబోసుకున్నారు. తాము కొద్ది రోజుల క్రితం అనంతపురం జిల్లా తాడిపత్రిలోని శ్రీమధుసాయి ట్రేడర్స్‌లో మొక్కజొన్న విత్తనాలు తీసుకువచ్చి పంట సాగుచేశామన్నారు. విత్తనాలు నాసిరకం కావడంతో పంట కాలం పూర్తయినా కంకికి విత్తనాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతుల వద్ద నుంచి విత్తన సాగు, ఎరువుల వాడకంపై వివరాలు ఆరా తీశారు. అన్ని కోణాల్లో పరిశీలించి పూర్తి నివేదిక జిల్లా వ్యవసాయాధికారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏవో వెంకటకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులు ఇళ్లకు తిరుగు ముఖం

● నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మెగా డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా పడింది. ఈనెల 19న జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో గుంటూరులో భారీ వర్షాలతో అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రకటించారు. కొత్త తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. అయితే ఈ కార్యక్రమానికి అభ్యర్థులు విజయవాడ వెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా 43 బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం జిల్లా కేంద్రం డీఈఓ కార్యాలయం నుంచి బస్సులు ప్రారంభం కావాల్సి ఉండగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు రావడంతో అభ్యర్థులకు వాయిదా అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు తిరిగి ఇంటి ముఖం పట్టారు. బస్సులు కూడా సంబంధిత డిపోలకు బయలు దేరాయి.

22 నుంచి జరగాల్సిన శిక్షణ కూడా... : నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుల కోసం సెప్టెంబరు 22 నుంచి 29 వరకు జరగాల్సిన ఇండక్షన్ ట్రైనింగ్ వాయిదా పడింది. తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత ఫ్యాకల్టీ సభ్యులు డీఆర్పీలకు వెంటనే తెలియజేయాలని ఆయన సూచించారు.



డీఈఓ కార్యాలయం వద్ద నుంచి ఇళ్లకు వెళుతున్న డీఎస్సీ అభ్యర్థులు

చోరీకి పాల్పడ్డ దొంగలు అరెస్ట్

రూ.8లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



పట్టుబడిన నిందితులను, ఆభరణాలను చూపుతున్న పోలీసులు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణం వెంకటయ్యనగర్‌లో ఈ నెల 10వ తేదీ ఇంటి తాళాలు పగులకొట్టి పట్టపగలు ఓ ఇంట్లో దోపిడీకి పాల్పడ్డ నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.8లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పట్టణం లోని అర్బన్‌పోలీస్‌స్టేషన్ ఆవరణలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, సీఐ లింగప్ప, ఎస్ఐ సత్యనారాయణలు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనా స్థలంలో సేకరించిన ఫింగర్‌ప్రింట్స్, సీసీపుటేజ్‌ల ఆధారంగా నిందితులు కడప ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ దిలీప్‌కుమార్, నాయబ్ రసూల్‌గా గుర్తించామన్నారు. వీరిపై గతంలో కూడా పలు చోరీ కేసులు ఉన్నట్లు వారు తెలిపారు. వీరి వద్ద నుంచి 118.04 గ్రాముల బంగారు నగలు, 4 గ్రాముల వెండి నాణేలను స్వాధీనం చేసుకున్నారు. నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్‌చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీ జరిగిన నాలుగురోజుల సమయంలోనే లింగప్ప పకడ్బందీగా నిందితులను పట్టుకున్నందుకు జిల్లా ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

ఉద్యోగం పొందడం ఎలా..!

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న అధికారిణి చల్లా రత్నకుమారి

వేంపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొదటిసారి ఉద్యోగం పొందడం ఎలా అనే అంశంపై ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశ నిర్వహణ అధికారిణి చల్లా రత్నకుమారి, రిసోర్స్ పర్సన్ జానిబాష విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్రిపుల్‌ఐటీలో చదివి స్టార్టప్ ప్రారంభించి రూ.3కోట్ల టర్నోవర్‌తో ఉన్న జానిబాష తన అనుభవాలను చెబుతూ ఎలా మొదటి ప్రయత్నంలో ఉద్యోగం పొందాలనే అంశాలను తెలిపారు. ఏఓ రవికుమార్, రమేష్, సత్యానంద, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసుకోవాలి : మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కోఆర్డినేటర్లు సుబ్బరాయుడు, తిరుపతిరెడ్డి, దీప్తిలు తెలిపారు. గురువారం ఎన్‌ఎస్‌ఎస్ 11,15 యూనిట్‌ల ఆధ్వర్యంలో గురువారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. క్యాంపస్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. మొదట ర్యాలీ నిర్వహించారు.

పోలీసుల అదుపులో నకిలీ పోలీస్

లింగాల,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లింగాల-పులివెందుల మార్గమధ్యలో గురువారం పోలీస్ అంటూ వాహనదారులను ఆపి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని లింగాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై పులివెందుల రూరల్ సీఐ ఎస్వీ రమణ మాట్లాడుతూ దొరిగిల్లు గ్రామానికి చెందిన నగేష్ (రాము) అనే వ్యక్తి సీఐ, ఎస్ఐ అంటూ లింగాలలో వసూళ్లకు పాల్పడుతున్నాడని వాహనదారుల నుంచి ఫిర్యాదు రావడంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని, ఆ సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నాడని పేర్కొన్నారు.

రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలి

● జాతీయ సదస్సులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ పేర్కొన్నారు. గురువారం కడప యోగివేమన విశ్వవిద్యాలయంలో 75 సంవత్సరాల భారత రాజ్యాంగం-సాంకేతిక పదజాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలని, ప్రజల మాతృభాషలో విలువైన గ్రంథాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ రాజ్యాంగ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తు చేసుకోవాలన్నారు. ముఖ్య వక్త ప్రొఫెసర్ నవేద్ జమాల్ రాజ్యాంగ సూత్రాలను అన్ని భారతీయ భాషలో సులభంగా అందించేందుకు సాంకేతిక పరిభాష అవసరమన్నారు. సీఎస్‌టీటీ అసిస్టెంట్ డైరెక్టర్లు జేఎస్ రావత్, షాజాద్ అహ్మద్ అన్సారీ సంస్థ భాషాభివృద్ధి కోసం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు, వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

● దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

కడప కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆకుల వీధిలో ఉన్న రాజరాజేశ్వరిదేవి దేవస్థానం పోస్టర్లను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. సుమారు 500 సంవత్సరాల నుంచి ఆకులవీధిలో రాజరాజేశ్వరిదేవి ఆలయం ఉందన్నారు. మట్లిరాజుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు ఇక్కడ లభించిన సమాచారాన్ని బట్టి తెలుస్తోందన్నారు. ప్రతి సంవత్సరంలాగే దేవదాయశాఖ పరిధిలో గల ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయన్నారు. అమ్మవారిని దర్శించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలక్రిష్ణశర్మ, ఆలయ ఈవో శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ శివయ్య పాల్గొన్నారు.

22 నుంచి దేవునికడపలో..

తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడపలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అలాగే ప్రతిరోజూ సాయంత్రం 7గంటలకు వాహన సేవలు ఉంటాయి.

గండికోటకు మళ్లీ కృష్ణాజలాలు

కొండాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు అవుకు రిజర్వాయర్ నుంచి మళ్లీ కృష్ణా జలాలు వస్తున్నాయని ఈఈ ఉమామాహేశ్వర్లు తెలి పారు. ఆదివారం కృష్ణాజలాలను నిలుపుదల చేయగా, మళ్లీ గురువారం 1500 క్యూసెక్కుల నీరు వస్తోం దన్నారు. అదేవిధంగా వాగులు, వంకలు, పెన్నా, చిత్రా వతి నదుల ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 26.411 టీఎంసీల నీటిమట్టం ఉందని ఈఈ తెలిపారు.

పాత సామాన్ల ముసుగులో విద్యుత్ మోటర్ల చోరీ.. దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ క్రిష్ణయ్య

గోపవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాత సామాన్లు కొంటాం.. పాత సామాన్లకు చక్కెర ఇస్తాం... అంటూ విద్యుత్ మోట ర్ల చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషనులో రూరల్ ఇన్‌స్పెక్టరు క్రిష్ణయ్య విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం ఎల్‌ఆర్‌పల్లెకు చెందిన పాశం రమేశ్ అనే వ్యక్తి పగటి పూట గ్రామాల్లో పాత సామాన్లు కొంటామంటూ సంచరిస్తూ రాత్రి పూట ఎవరూ లేని సమయంలో దొంగతనాలు చేసేవాడు. బద్వేలు, గోపవరం పరిసర ప్రాంతాలైన టి.సండ్రపల్లె, వనంపుల గ్రామాల్లో ఇటీవల విద్యుత్ మోటర్లు దొంగలించాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం శ్రీనివాసపురం సమీపంలో హరిత హోటల్ వద్ద నిందితుని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి మూడు మోటారు బోర్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఇన్‌స్పెక్టరు తెలిపారు. దొంగను అరెస్టు చేయడంలో కృషి చేసిన సీఐ క్రిష్ణయ్య, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందిని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ప్రజా పోరాటాల యోధుడు సురవరం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని భారత మినిస్ట్రీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి తులసిరెడ్డి కొనియాడారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అధ్యక్షతన సురవరం సంస్మరణ సభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిధిలుగా వారు హాజరై మాట్లాడారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాలలో సురవరం పుట్టి పెరిగి కర్నూలులో చదువుకుంటూ ఏఐఎస్‌ఎఫ్‌లో తొలుత సభ్యుడిగా చేరారన్నారు. విద్యారంగ సమస్యలపై పలు పోరాటాలు చేసి తద్వారా ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజల పక్షాన పలు పోరాటాలు చేశారన్నారు. దున్నేవాడికి భూమి ఇవ్వాలని, ఇంటి స్థలం, ఇంటితో పాటు మౌలిక సదుపాయాలు ప్రాథమిక హక్కుగా భావించి వాటి సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన పోరాట యోధుడు అన్నారు. సీపీఐ నాయకులు చంద్రశేఖర్, గుంటి వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, రామయ్య, వెంకటశివ, బాదుల్లా, సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, మల్లిఖార్జున, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, లోక్‌సత్తా నేత శ్రీక్రిష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వసంతపేట ఎస్‌బీఐ కాలనీలో నివశిస్తున్న ఇంద్రకంటి విజయలక్ష్మి(53) గురువారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. బంధువులు తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా కనబడలేదు. విజయలక్ష్మి కొందరి వద్ద అప్పులు చేసి... వారి ఒత్తిళ్లు తట్టుకోలేక ఇంటి నుంచి వెళ్లినట్లు కుమారుడు వినోద్ వెల్లడించారు. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన రసూల్ (50) బుధవారం తెల్లవారు జాము నుంచి అదృశ్యమయ్యాడు. 16వ తేదీ భార్య భర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో మనస్థాపం చెంది వెళ్లినట్లు డని అతని భార్య రషీదా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

సంతృప్తికరస్థాయి సేవలందించాలి : ఎస్ఈ

చక్రాయపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థపై ప్రజల సంతృప్తికరస్థాయి పెంచే విధంగా సేవలు అందించాలని కడప జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ సూచించారు. గురువారం మండలంలోని యర్రగుడిలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలపై వచ్చినపుడు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది, అధికారులు వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ సావధానంగా విని పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు తగినన్ని అందుబాటులో ఉన్నాయని, అవసరమైన ప్రాంతాలలో ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతి తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని, రూ.98వేల వరకు సబ్సిడీ ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలియజేయాలన్నారు. వినియోగదారులు అంతరాయాలు సహించే పరిస్థితిలో లేరని, ముందస్తు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అంతేకాకుండా విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు విధిగా దాడులు నిర్వహించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

విద్యుత్ షాక్‌కు గురై..పాడిగేదె, దూడ మృతి



రాజుపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో టంగుటూరు గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై పాడిగేదె, దూడ మృతి చెందింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గంగమ్మ అనే మహిళ ఐదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఒక సెంటులో రేకుల ఇల్లు వేసి.. అందులోనే పాడిగేదెను పెట్టుకొని వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటికి లాగిన కరెంటు తీగ తెగి రేకుల షెడ్డు మీద పడడంతో విద్యుత్ పాసై ఈ ప్రమాదం జరిగింది. పాడిగేదకు బీమా వర్తించని పశువుల అధికారులు తెలపడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతున్నారు.

బిల్లులు, పెండింగ్ జీతాలు ఇప్పించండి సార్

కలెక్టర్‌ను కోరిన పీలేరు సర్పంచ్, కార్మికులు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారిశుద్ధ్య కార్మికుల, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ల వర్కర్ల పెండింగ్ జీతాలు, పనులు పూర్తి చేసి ఎంబుక్‌లు రికార్డు చేసినా రాని బిల్లులు వెంటనే ఇప్పించాలని పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా ఆధ్వర్యంలో కలెక్టర్ నిషాత్ కుమార్‌ను కోరారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసిన కార్మికులు సమస్యలను ఏకరువు పెట్టారు. గతేడాది మే, జూన్ మాసాల జీతాలు 46 మందికి ఇప్పటి ఇరకూ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక వర్గం ఆమోదంతో కార్మికులకు నెలకు రూ. 3 వేలు జీతం పెంచితే అందులో రూ. 1000 తగ్గించారని వాపోయారు. పట్టణ ప్రజలకు ప్యూరిఫైడ్ వాటర్ అందించేందుకు 26 ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారని, వర్కర్లకు 12 నెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతో పస్తులతో అలమటిస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. అభివృద్ధి పనులు పూర్తి చేసి ఎంబుక్‌లు రికార్డు చేసినా బిల్లులు రాలేదని, సత్వరం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీపీఓ రాధమ్మ, డీఎల్‌పీఓ నాగరాజ, మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, తహసీల్దార్ శివకుమార్, వార్డు సభ్యులు విక్టరీ వెంకట్రమణారెడ్డి, మల్లికార్జున రెడ్డి, సాంబశివరెడ్డి, పరమేష్, కాలేషా తదిరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు



సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నేతలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్లో టెన్త్ విద్యార్థిని హెచ్‌ఎం తిట్టాడని బీఎస్పీ నేతలు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి ఫిర్యాదు చేశారు. గురువారం సబ్ కలెక్టరేట్‌కు వచ్చిన బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఎం.బాలాజి మాట్లాడుతూ టెన్త్ విద్యార్థి లోకేశ్‌ను హెచ్‌ఎం రాజేంద్రబాబు అకారణంగా దుర్భాషలాడాడని, పాఠశాలకు రావద్దని ఛీదరించుకున్నాడన్నారు. మరో తొమ్మిది మందిపై కూడా ఇలాగే ప్రవర్తించాడన్నారు. ఈ విషయమై తాము హెచ్‌ఎంను ప్రశ్నిస్తే లోకేశ్ మినహా మిగిలిని వారిని అనుమతించాడన్నారు. దీనిపై ఎంఈఓ ప్రభాకర్ రెడ్డిని, హెచ్‌ఎంను పిలిపించి సబ్‌కలెక్టర్ విచారించారు. టెన్త్ విద్యార్థి కొద్ది రోజులుగా సక్రమంగా పాఠశాలకు రావడం లేదని, ఈ విషయమై తాను మందలించానని హెచ్‌ఎం అన్నారు. విద్యార్థిని కులం పేరుతో దూషించలేదని, కొందరు అవాస్తవాలు ఫిర్యాదు చేశారని సబ్‌కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. ఇక మీదట ఇలాంటి ఘటనలు జరగకుండా పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాలన్ని ఎంఈఓను ఆదేశించారు.

స్కౌట్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ, దేశభక్తి

● బలకవారిపల్లె హైస్కూల్‌లో యూనిట్ ప్రారంభం



విద్యార్థులను స్కౌట్ యూనిట్‌లోకి ఆహ్వానిస్తున్న స్కౌట్ అధికారులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్కౌట్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం పెంపొందుతాయని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, జిల్లా భారత్ స్కౌట్స్ కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు. గురువారం బలకవారిపల్లె ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అజాద్ స్కౌట్ ట్రూప్ నూతన యూనిట్‌ను ప్రారంభించిన వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, ధైర్య సాహసాలు పెంపొందించే లక్ష్యంతో మారుమూల గ్రామీణ ప్రాంతమైన ఈ పాఠశాలలో స్కౌట్స్ యూనిట్‌ను ప్రారంభించడం హర్షణీయమన్నారు. ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, రాష్ట్ర స్కౌట్ శిక్షణ టీచర్లు ఏఎల్‌టీ ఉమాపతి, హెచ్‌డబ్ల్యూటీ ఇమాంసాబ్, జిల్లా ఏఎస్‌ఓసీ లక్ష్మీకర్, హెచ్‌ఎం రమేష్‌బాబు, టీడీపీ నేత మదన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : డీఎస్పీ

నిమ్మనపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలిగి సమాజానికి మంచి చేయాలని డీఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. స్టేషన్ రికార్డులు తనిఖీ చేసి సిబ్బంది హాజరు, కేసులు పురోగతిపై ఆరాతీశారు. అనంతరం రౌడీ షీటర్లు, సమాజంలో అల్లర్లు సృష్టించే వ్యక్తులను పిలిపించి వారికి హెచ్చరికలు జారీ చేశారు. సైబర్ క్రైమ్ బాధితులు రోజు రోజుకూ ఎక్కువ అవుతున్నారని వాటిని అరికట్టాలంటే ప్రజల మీదే ఆధారపడి వుందన్నారు. హనీ ట్రాప్ పేరుతో కాల్ చేసి పలువుని మోసగించినట్లు తెలిపారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలను పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ నేతలు గురువారం మదనపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, జీతాలు వెంటనే చెల్లించాలని, మరణించిన కార్మికుల స్థానంలో కుటంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, టీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, రాజు, వెంకటరమణ, కృష్ణప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన అవసరం

రామసముద్రం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యులకు జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య సూచించారు. రామసముద్రం, చెంబకూరు పీహెచ్‌సీలను ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ్ నారి స శక్తి పరివార్ పథకంను విజయవంతం చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

పడకేసిన పారిశుధ్యం

గ్రామాల్లో విజృంభిస్తున్న విషజ్వరాలు ● పూడిపోయిన మురుగునీటి కాల్వలు
● రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు ● పట్టించుకోని పంచాయతీ అధికారులు



కాల్వలో పేరుకున్న మురుగునీరు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏ పంచాయతీ చూసినా ఏముంది గర్వకారణం అన్నట్లు మండల పంచాయతీల్లో మురుగునీటి కాల్వలు దర్శనమిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయమే కార్యదర్శులు ఆయా పంచాయతీల్లో పారిశుద్ధ్య ప నులు పర్యవేక్షించి యాప్ ద్వారా జిల్లా అధికారులకు ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ చేయడం లేదు. రాపూరివాండ్లపల్లె, పులి కల్లు, తుమ్మరకుంట, నవాబుకోట, కాట్లగల్లు, పట్టెంవాండ్లపల్లె, కమ్మచెరువు, టి.సదుం, కందుకూరు, సంపతికోట గ్రామాల్లో కాల్వలు పూర్తిగా మురుగుతో దర్శనం ఇస్తున్నాయి. వర్షాలతో గ్రామాల్లో కాల్వల్లో మురికి నీరు నిలవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు ఎక్కువై పల్లెల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

ఇళ్ల ముందరే నిలుస్తున్న మురుగునీరు

మండలంలోని అనేక గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాల్వల్లోని మురికి నీరు ఇళ్ల నడుమ నిలవడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలకు విషజ్వరాలు ప్రబలుతున్నాయి. పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా గ్రామాల్లో ఫలితం శూన్యమనే చెప్పాలి. రాపూరివాండ్లపల్లెలో కాల్వలు పూర్తిగా పూడి అస్తవ్యస్థంగా తయారయ్యాయి. వీధుల్లో కాల్వలు పొంగిపొర్లు తుండడంతో దోమలు ఎక్కువై గ్రామంలో అనేక మందికి విషజ్వరాల బారిన పడుతున్నారు.



పీటీఎం సంతబజారులో నీటి ట్యాంకుకు పేరుకున్న పాచి

నివాసాల మధ్య కాల్వలు ఆక్రమణ

రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెలో ఉన్న కాల్వను కొందరు యదేచ్ఛగా ఆక్రమించి కాల్వలపై నిర్మాణాలను చేపట్టినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాల్వలను పూర్తిగా ఆక్రమించుకోవడంతో కాల్వల్లో పారాల్సిన నీరు జనావాసాల్లోకి చేరుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంది. అధికారులకు విన్నవించినా అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలున్నాయి. కనీసం ఇప్పటికైనా గ్రామాల్లో ఆక్రమణకు గురైన కాల్వలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



విసనకర్రవాండ్లపల్లెలో కాల్వపై అక్రమంగా నిర్మించిన మరుగుదొడ్డి

నామమాత్రంగా స్వచ్ఛసేవ

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ సేవ కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో నామమాత్రంగా చేపట్టి చేతులు దులిపేసుకుంటున్నారే తప్ప పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే, ఎక్కడి మురుగు అక్కడే ఉండడంతో గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. కనీసం ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా అయినా పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



రాపూరివాండ్లపల్లెలో పూర్తిగా పూడిపోయిన మురుగు కాల్వ

నాయీబ్రాహ్మణుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయీబ్రాహ్మణులు

ములకలచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో గురువారం నాయీబ్రాహ్మణులు నిరసనకు దిగారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చి కార్పొరేట్ క్షవరశాలలు ఏర్పాటు చేయడంతో జీవనోపాధి కోల్పోతున్నామని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం సీఐ వెంకటేశులు, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకి వినతి పత్రాలు అందజేశారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగభూషణ, కార్యదర్శి నాగరాజ, నియోజవర్గ అధ్యక్షుడు రామదాసు, మండల అధ్యక్షుడు శేఖర, మంజునాథ్, నాగేంద్ర, గణేష్, సుధాకర, చెన్నకేశవులు, విజయ్‌కుమార్, ధనుంజయ, చంద్ర పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై జాగ్రత్తలు పాటించాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు పాలించాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. గురువారం రెడ్డివారిపల్లి పంచాయతీ బురుజుమాదిగపల్లిలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ అంబుడ్స్‌మెన్‌లు చెత్త సేకరణలో పొడి, తడిచెత్తను వేరు వేయాలని, సేకరించిన చెత్తను సమీప చెత్త సంపద కేంద్రాలకు తరలించి వాటి ద్వారా ఎరువును తయారు చేయాలన్నారు. తాగునీటి ట్యాంక్‌లను నిత్యం శభ్రం చేసి గ్రామీణులకు మంచి నీటిని సరఫరా చేయాలని నీటి సమస్య రాకుండా మందు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు అన్నారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్, పీడీల పర్యవేక్షణలో అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు వివిధ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీలో అండర్-14 బాలురు, బాలికల విభాగంలో తంబళ్లపల్లె హైస్కూలు, అండర్-17 బాలురు, బాలికల విభాగంలో తంబళ్లపల్లె గిరిజన గురుకులం, కోసువారిపల్లె హైస్కూలు, వాలీబాల్ అండర్-14 బాలురు విభాగంలో రేణుమాకులపల్లె హైస్కూలు, అండర్-17 బాలికలు విభాగంలో మోడల్ స్కూల్, ఖోఖో అండర్-14, 17 బాలికల విభాగంలో కన్నెమడుగు హైస్కూలు, ఖోఖో అండర్-14 బాలురు, వాలీబాల్ బాలికలు విభాగంలో కన్నెమడుగు హైస్కూలు జట్లు విజయం సాధించినట్లు ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈఓలు, హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు అభినందించారు.

డిమాండ్లు పరిష్కరించాలంటూ వినతి



కమిషనర్ పల్లవికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ బి.కొత్తకోట నగరపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కమిషనర్ పల్లవికి వినతి పత్రం అందజేశారు. అంతకు మునుపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీని ప్రకటించాలి, సమ్మె కాలానికి జీతాలివ్వాలి, సంక్షేమ పథకాలను అమలు చేయాలి లాంటి 8 డిమాండ్ల పరిష్కారం కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపుపై నిరసన చేపట్టినట్టు పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్యం దేశ సౌభాగ్యం





విఠలం గ్రామంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిశ్రీ - గుడిసివారిపల్లి అంగన్వాడీలో పౌష్టికాహార ప్రదర్శన

వాల్మీకిపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని చింతపర్తి పీహెచ్‌సీ డాక్టర్ సాయిశ్రీ పేర్కొన్నారు. గురువారం విఠలం గ్రామంలో ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం కార్యక్రమం నిర్వహించారు. మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయన్నారు. గర్భిణులకు ఈ పౌష్టికాహారం పంపిణీ చేశారు. క్యాన్సర్ స్క్రీనింగ్, జీవన శైలిలో మార్పులపై అవగాహన, వ్యాధి నిరోధక టీకాలు తదితర విషయాలు తెలిపారు. ప్రధాన మంత్రి ఆరోగ్య బీమా కార్డుల నమోదు, సికెల్సెన్ పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ అరుణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫి, సూపర్‌వైజర్లు బహుద్దీన్, బానుబీ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యం తీర్చిదిద్దడమే లక్ష్యం

ములకలచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే పోషణ లక్ష్యం - పోషణ మాసమని సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. చీకుచెట్టుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ్ మహోత్సవ్‌లో ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ ప్రభావతమ్మ, ఎడబ్యాడబ్యా లక్ష్మీదేవి, సిబ్బంది రేణుకా, మంజుల పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం సెక్టార్‌లోని పులికల్లు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ రామలక్ష్మి పోషణ మాసోత్సవాలను ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలకు ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరళ, సుకన్య, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మాతా శిశువుల ఆరోగ్యం

బి.కొత్తకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, ఆకుకూరలు, చిరుధాన్యాల ద్వారా మాతాశిశువుల్లో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. దినుసులు, పండ్లు తదితర ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ, హాజరైన గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగరత్న, సీహెచ్‌ఓ గ్రీష్మ, ఎఎన్ఎం అరుణ, కార్యకర్త పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె



పంచాయతీ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. నెలరోజులుగా పీఎఫ్ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని దీంతో తాము సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల చేపట్టిన నిరసన సమయంలో వారం రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి విధులను బహిష్కరించి పంచాయతీ కార్మికులంతా కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ ఈఓ రవీంద్రనాథ్, కార్మికులతో చర్చించారు. వచ్చేనెల 5వ తేదీలోపు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. పంచాయతీ కార్మికులు శ్రీరాములు, వెంకటేష్, రమణ, జయరామ్, చంద్ర, నాగరాజు, శివ, వసంతమ్మ, రాముడు, రాజు, ఓం పాల్గొన్నారు.

సంపదను సృష్టిద్దాం

కురబలకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించి పంచాయతీల బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. కురబలకోటలోని ఎస్‌డబ్ల్యుపీసీ కేంద్రంలో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గంలో సీఆర్‌పీసీలకు అవగాహన చేపట్టిన ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను ఇంటి నుంచే వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. రెండింటినీ కలిపి వేయడం వలన మళ్లీ వీటిని వేరుచేయడానికి అధిక సమయం పట్టడం, శ్రమించాల్సి వస్తోందన్నారు. చెత్తను వీధుల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లలో వేయాలని, దీంతో చెత్త సేకరణ సులభతరం అవుతుందన్నారు. ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ వేయడం వలన అపరిశుభ్రత ఏర్పడి దోమలు ప్రబలి రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్ సుజాత, ఈఓపీఆర్‌డీ అశ్విని, కార్యదర్శి ఉదయ్‌కుమార్, రిసోర్సుపర్సన్‌లు రాజశేఖర్, చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సర్వేను వేగంగా చేయండి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న సర్వేను త్వరగా చేయాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. గురువారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ ఈఓపీఆర్డీ మోహన్ ప్రతాప్‌తో కలిసి కందుకూరులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా నిర్మించుకున్న ఇళ్లను పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్లు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటినీ కొలత తీయాలన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో రికార్డుల్లోకి నమోదు చేసి సచివాలయాల్లో అందుబాటులో ఉంచేందుకే ఈ సామిత్ర సర్వేను ప్రభుత్వం చేపట్టింది. ఆయా గ్రామాల్లో వారికి కేటాయించిన ఇండ్లను సర్వే పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ అనిల్‌కుమార్

కలికిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికత వేగంగా విస్తరిస్తున్న కారణంగా విద్యార్థులు దైనందిన కార్యక్రమాల్లో ఎన్నో జాగ్రత్తలతో అప్రమత్తంగా వుండాల్సిన అవసరముందని కలికిరి ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రధానంగా వైట్ కాలర్ నేరాలు, సైబర్ క్రైమ్ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బెట్టింగ్‌లతోసహా ఇతర జూదాలు యువకుల జీవితాలను దారుణంగా దెబ్బతీస్తాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకింగ్ ఫ్రాడ్‌లు, ఓటీపీ, పాస్‌వర్డ్ షేరింగ్‌ల వంటి అంశాల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకూ పూర్తి స్థాయిలో అవగాహన వుంటుందని, ఇందులో ఏమరుపాటు లేకుండా వుండాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌లకు దూరంగా వుండాలన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల నిరసన

కలికిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం వీఆర్‌ఏలు నిరసన చేపట్టారు. మండల కేంద్రంలో రెండు రోజులపాటు దీక్షలు చేయనున్నట్లు వీఆర్‌ఏలు తెలిపారు. అనంతరం 20న మదనపల్లె సబ్ కలెక్టరు కార్యాలయం ముందు, 22న కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేయనున్నట్లు చెప్పారు. వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు చేయాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు, నామినీల నియామకాలపై తక్షణం ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలకు పూనుకున్నట్లు వీఆర్‌ఏల జిల్లా సంఘం కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు.